



అనంత మార్కెట్‌లో రద్దీ

ఉగాది సందడి

నేడు తెలుగువారి తొలి పండుగ.. కొనుగోలుదారులతో మార్కెట్‌లో రద్దీ

అనంతపురం కల్చరల్/టౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సరాది.. ఉగాదిని ఆదివారం ఘనంగా నిర్వహించుకునేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. ప్రకృతితో ముడిపడిన ఈ పర్వదినాన్ని ఏటా చైత్ర శుద్ధ పాడ్యమినాడు నిర్వహించుకోవడం ఆనవాయితీ. కలిమిలేములలో జీవిత మాధుర్యాన్ని చాటే షడ్రుచుల ఉగాది పచ్చడి ఈ పండుగ ప్రత్యేకం. పండుగ కొనుగోళ్లతో మార్కెట్లు రెండు రోజుల ముందు నుంచే కిటకిటలాడాయి. పూలు, పండ్లు, పండుగ సామగ్రి, కొత్త దుస్తుల కొనుగోళ్ల కోసం జనం ఎగబడ్డారు. ఆలయాలలో పంచాగ శ్రవణం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలోని కృష్ణ కళామందిర్‌లో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఉగాది ఉత్సవాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలకు ఉమ్మడి జిల్లాలోని మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు హాజరవుతారు.

కలెక్టరేట్‌లో వేడుకలు: కలెక్టర్

ఉగాది ఉత్సవాలపై కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులతో కలెక్టరేట్‌లో శనివారం సమీక్ష నిర్వహించారు. వేడుకలలో తెలుగువారి సంప్రదాయం ఉట్టిపడాలని సూచించారు. కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచే ఉగాది ఉత్సవాలు ప్రారంభమయ్యేలా చూడాలని ఆదేశించారు. పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం, ఉగాది పచ్చడి పంపిణీకి ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమీక్షలో జేసీ శివనారాయణశర్మ, డీఆర్వో మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, నగరపాలక సంస్థ కమిషనర్ బాలరాజు, డీఈఓ ప్రసాద్‌బాబు, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీ దేవి తదితరులు పాల్గొన్నారు.



మండుతున్న ఎండ

(వివరాలు 8లో..)

తెలుగువారి కీర్తి పతాక..

టీడీపీ

ఆవిర్భావ సభలో పార్టీ నాయకులు

వాడవాడలా ఎగిరిన పసుపు జెండా

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవాలు (8లో..)





టీడీపీ అర్బన్ కార్యాలయ భవన నిర్మాణానికి శ్రీనగర్ కాలనీలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం భూమి పూజ చేశారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగారామ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. పార్టీ కోసం నిరంతరం సేవలు అందిస్తున్న పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గౌస్‌మొద్దీన్, సరిపూటి రమణ, రాయల్ మురళి తదితరులు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం అర్బన్

రేపటి నుంచి కొనుగోలు కేంద్రాల బంద్

అనంతపురం టౌన్, మార్చి29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలు చేస్తున్న అన్ని కొనుగోలు కేంద్రాలను ఈనెల 31 నుంచి మూసి వేస్తామని సివిల్ సప్లై డీఎం రమేష్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 ఖరీఫ్ కాలం పంటలకు సంబంధించి వివిధ రకాల ధాన్యాన్ని ఈకేంద్రాల ద్వారా కొనుగోలు చేశారు. ఖరీఫ్‌లో రికార్డుల మేరకు 23వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందన్నారు. అందులో ఇప్పటి వరకు రైతుల నుంచి 13.912 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు డీఎం తెలిపారు. అమ్ముకోవడానికి ఆదివారం వరకు అవకాశం ఉందని, ఇంకా ఎవరైనా రైతులు తమ ధాన్యంను కొనుగోలు కేంద్రాలకు తీసికెళ్లి అమ్ముకోవచ్చని డీఎం రమేష్‌రెడ్డి తెలిపారు.

టెన్త్ ఒకేషనల్ పరీక్షకు 135 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఓరియంటల్ సెకెండరీ స్కూల్ సర్టిఫికెట్(ఓఎస్ఎస్‌సీ) ఒకేషనల్ పరీక్షలకు శనివారం రెగ్యులర్ విద్యార్థులు 135 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 33 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 5019 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 4884 మంది హాజరుకాగా 135 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 97.31 హాజరు శాతం నమోదైంది. సిట్టింగ్ స్క్వాడ్ ఆరు కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.

బఫర్‌తో సఫర్

9లో

అనంతపురం మీదుగా ప్రత్యేక రైలు



గుంతకల్లు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ నియంత్రణకు నరసాపూర్-అరిసికెర-నరసాపూర్ (వయా అనంతపురం) ప్రత్యేక వీక్లీ రైలు (నం. 07201/02)ను నడపనున్నట్లు రైల్వే అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నరసాపూర్-అరిసికెరె ప్రత్యేక రైలును ఈ ఏప్రిల్ 6, 13, 20, 27, మే 04, 11, 18 25 తేదీల్లో నడపనున్నట్లు తెలియజేశారు. ఈ రైలు పేర్కొన్న తేదీలలో (ఆదివారాలలో) నరసాపూర్‌లో మధ్యాహ్నం 2-20 గంటలకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12-45 గంటలకు అరిసికెరెకు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు ఏప్రిల్ 7, 14, 21, 28, మే 5, 12, 19, 26 తేదీల్లో (సోమవారాలలో) మధ్యాహ్నం 2 గంటలకు అరిసికెరెలో బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1 గంటకు నరసాపూర్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గోవిందవాడ, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, మార్కాపూర్ రోడ్డు, కంబం, గిద్దలూరు, నంద్యాల, డోన్, గుత్తి, అనంతపూర్, ధర్మవరం, హిందూపురం, యల్హంక స్టేషన్ల మీదుగా వెళ్తుందని వివరించారు.

రైలు స్థానాల మార్పు

ధర్మవరం రైల్వే స్టేషన్‌లో నిర్వహణ సమస్యల కారణంగా మచిలీపట్నం-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు గమ్యస్థానాన్ని మార్చినట్టు రైల్వే అధికారులు తెలిపారు. మచిలీపట్నం-ధర్మవరం (నం. 17215) ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 31 నుంచి అనంతపురం వరకే గమ్యస్థానాన్ని కుదించినట్టు తెలియజేశారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 17216)ను ఏప్రిల్ 1 నుంచి మే 1 వరకూ ధర్మవరం నుంచి కాకుండా అనంతపురం నుంచి బయల్దేరుతుందని తెలియజేశారు.

రహదారుల మరమ్మతుకు నిధులు

ఉమ్మడి జిల్లాకు భారీగా మంజూరు

అనంతపురం న్యూటౌన్/పుట్టపర్తి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఆర్ అండ్ బీ పరిధిలోని రాష్ట్ర, జిల్లా రహదారుల మరమ్మతుకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం నిధులు మంజూరు చేసింది. గుత్తి నుంచి పత్తికొండ మీదుగా ఆదోని వెళ్లే రోడ్డుకు రూ.2 కోట్లు మంజూరు చేసింది. అనంతపురం నుంచి తగరకుంట, అనంతపురం నుంచి రాయచూర్ రోడ్డు మరమ్మతులకు రూ.2.5 కోట్లు ఇచ్చింది. కళ్యాణదుర్గం నుంచి మడకశిర వెళ్లే రోడ్డుకు రూ.4.8 కోట్లు, రాయదుర్గం నుంచి బళ్లారి వెళ్లే రోడ్డుకు రూ.6.2 కోట్లు, ఉరవకొండ-కణేకల్లు రోడ్డుకు రూ.4 కోట్లు మంజూరు చేసింది. రాప్తాడు నియోజకవర్గంలోని దామాజిపల్లి-తాడిపత్రి రోడ్డుకు రూ.కోటి, నాగసముద్రం-పేరూరు రోడ్డుకు రూ.2.5 కోట్లు, పుట్టపర్తి నియోజకవర్గంలోని కోడూరు నుంచి ధర్మవరం వెళ్లే రోడ్డుకు రూ.కోటి మంజూరైంది. ధర్మవరం నుంచి కళ్యాణదుర్గం రోడ్డుకు రూ.1.5 కోట్లు మంజూరు చేసింది. పెనుకొండ నియోజకవర్గంలో బ్రాహ్మణపల్లి, కొల్లకుంట క్రాస్, జూలకుంట, మండ్లి మీదుగా వెళ్లే రహదారి, సోమందేపల్లి నుంచి రాచూరు, అడదాకులపల్లి, ఎల్‌జీపీ నగర్ రాచూరు రహదారులకు రూ.2.10 కోట్లు కేటాయించింది. సోమందేపల్లి మండలం ఆనందపురం సంగమేశ్వరం రాహదారి, బ్రహ్మసముంద్ర మీదుగా కొల్లకుంట, వంగలపల్లి, బీచుగానిపల్లి, ఊటకూరు దాకా రూ.3.20 కోట్లు మంజూరైంది. ధర్మవరం నియోజకవర్గంలోని సంజీవపురం నుంచి వెంటకగిరిపాళ్యం, లింగారెడ్డిపల్లి, ముక్తాపురం, కామిరెడ్డిపల్లి, కట్టకిందపల్లి, మచ్చురామి రహదారులకు రూ.2.60 కోట్లు ప్రభుత్వం ఇచ్చింది. మడకశిర నియోజకవర్గంలో మధూడి, రామాపురం, బందర్లపల్లి, ఆర్‌జే రోడ్, జీఎస్ తండా, హెచ్‌ఆర్ హట్టి, పి.గొల్లహట్టి, అగళి, బొమ్మరాసనపల్లి, కొండేపల్లి రహదారికి రూ.2.62 కోట్లు ఇచ్చింది. కదిరి నియోజక వర్గంలో తిమ్మమ్మమర్రిమాను అనుసంధానం రహదారికి రూ.20 లక్షలు ఇచ్చింది. హిందూపురంలో కొండికొండ రాష్ట్ర సరిహద్దు, సోమందేపల్లి నుంచి ఎల్‌జీపీ నగర్ దాకా మరమ్మతులకు రూ.2.50 కోట్లు ఇచ్చారు. నాగసముద్ర నుంచి పేరూరు దాకా రహదారికి రూ.2.50 కోట్లు, దామాజీపల్లి నుంచి తాడిపత్రి రహదారికి రూ.కోటి, ధర్మవరం, కళ్యాణదుర్గం రహదారికి రూ.50 లక్షలు మంజూరైంది.



టీడీపీ జిల్లా కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సవిత

తెలుగువారి కీర్తి పతాక.. టీడీపీ

ఆవిర్భావ సభలో పార్టీ నాయకులు

వాడవాడలా ఎగిరిన పసుపు జెండా

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవాలు

అనంతపురం అర్బన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల కీర్తి పతాక తెలుగుదేశం అని ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. వాడవాడలా పసుపు జెండాను ఎగురవేశారు. ఎన్టీఆర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

● అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాల సమీపంలో, జడ్పీ ఆవరణలోని ఎన్టీఆర్ విగ్రహాలకు నాయకులు, కార్యకర్తలు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పార్టీ జెండాను ఆవిష్కరించారు.

● టీడీపీ ఆవిర్భావంతోనే ఏపీకి నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. పెనుకొండలోని పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి ఆమె పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. టీడీపీ జెండా ఆవిష్కరించారు.



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే పరిటాల సునీత



రాయదుర్గంలో ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



పెనుకొండలో టీడీపీ సీనియర్ నాయకులను సన్మానిస్తున్న బీకే పార్థసారథి



తాడిపత్రిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి



నీలారెడ్డిపల్లిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ, టీడీపీ నాయకులు

● తెలుగుదేశం పార్టీని ఎన్టీఆర్ పేదల కోసం స్థాపించారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడులోని పార్టీ కార్యాలయంలో పసుపు జెండాను ఎగురవేశారు.

● పేదరికాన్ని రూపుమాపడమే టీడీపీ లక్ష్యమని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.

● రాయదుర్గంలోని పార్టీ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళి అర్పించారు. ఎంపిక చేసిన పార్టీ సీనియర్ నాయకులను సత్కరించారు.

● పెనుకొండలోని పార్టీ కార్యాలయంలో ఎంపీ బీకే పార్థసారథి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన సీనియర్ నాయకులను సన్మానించారు.

● తాడిపత్రి పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

● బుక్కరాయసముద్రం మండలం నీలారెడ్డిపల్లిలో పార్టీ జెండాను శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఎగురవేశారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. తెలుగువారి ఆత్మగౌరవం కోసం పుట్టిన పార్టీ టీడీపీ అని అన్నారు.

● మడకశిర ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.

● కదిరి మున్సిపల్ కార్యాలయంలో వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే కందికుంట వెంపట్రసాద్ పూలమాల వేసి నివాళి అర్పించారు.

● పుట్టపర్తిలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు.

● ధర్మవరం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో టీడీపీ జెండాను నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలు, నాయకులకు పంచిపెట్టారు.



కళ్యాణదుర్గంలోని ప్రజావేదిక వద్ద టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



మడకశిరలో ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల



కదిరి మున్సిపల్ కార్యాలయం వద్ద ఎన్టీఆర్‌కు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కందికుంట



పుట్టపర్తి లో పార్టీ ఆవిర్భావ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె



ధర్మవరంలో కేక్ కట్ చేస్తున్న పరిటాలశ్రీరామ్

అనంత వాసులకు ఉగాది పురస్కారాలు

ప్రభాకర్ చౌదరికి కళారత్న అవార్డు



ప్రభాకర్ చౌదరి, ఉమ్మడిశెట్టి రాధేయ, పూర్ణచంద్రశేఖర్, గురుమూర్తి గుప్త

అనంతపురం కల్చరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పురస్కారాల్లో నలుగురు అనంత వాసులకు చోటు దక్కింది. రాష్ట్ర వ్యాప్తంగా 86 మందిని కళారత్న అవార్డులకు ఎంపిక చేయగా.. సామాజిక సేవల విభాగంలో అవే సంస్థ వ్యవస్థాపకుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి కళారత్న(హంస) అవార్డుకు ఎంపికయ్యారు. 116 మందిని ఉగాది పురస్కారాలకు ఎంపిక చేయగా అనంతపురం జిల్లా నుంచి సాహిత్య విభాగంలో ఉమ్మడిశెట్టి సాహితీ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ ఉమ్మడిశెట్టి రాధేయ, వాస్తు జ్యోతిష్య పండితుడు చిత్రాల గురుమూర్తి గుప్త, రంగస్థల నాటకం విభాగంలో సురబి వనరస పూర్ణచంద్ర శేఖర్ పురస్కారాలకు ఎంపికయ్యారు. ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉగాది సంబరాల్లో వీరికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా పురస్కారాలు అందజేసి సత్కరించనున్నారు.

మైనాస్వామికి ఉగాది పురస్కారం



గోరంట్ల, మార్చి 29(ఆంధ్రజ్యోతి): చారిత్రక పరిశోధకుడు మైనాస్వామికి రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారాన్ని ప్రకటించింది. చారిత్రక పరిశోధన, శాసన పరిశోధనలో ఆయన చేసిన విశేష కృషిని ప్రభుత్వం గుర్తించి, పురస్కారాన్ని ప్రకటించింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగే ఉగాది వేడుకలలో ఆయన పురస్కారాన్ని అందుకుంటారని రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకులు మల్లికార్జున తెలిపారు.

తాడిపత్రికి రావద్దని ఆంక్షలు సరికాదు

ఎస్పీని కలిసిన వైసీపీ నేతలు



మీడియాతో మాట్లాడుతున్న వైసీపీ నేతలు

అనంతపురం క్రైం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తాడిపత్రిలో జరుగుతున్న పరిణామాలపై వైసీపీ నేతలు శనివారం ఎస్పీ జగదీష్‌ను కలిశారు. మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్, మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, హజ్ కమిటీ మాజీ చైర్మన్ గౌసులాజమ్, నగర మేయర్ మహమ్మద్ వసీం, కౌన్సిలర్ ఫయాజ్ బాషా తదితరులు ఎస్పీని కలిశారు. ఇటీవల తాడిపత్రిలో మైనార్టీ నాయకుడు ఫయాజ్‌బాషా ఇంటిపై జేసీ వర్గీయుల దాడిని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తాడిపత్రిలో టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి దౌర్జన్యాలు తీవ్రమయ్యాయని అన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక అటవిక రాజ్యం ఏర్పడిందన్నారు. వైసీపీ కౌన్సిలర్ ఫయాజ్‌బాషా ఇంటిపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని అన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి దాడి చేస్తే ఫయాజ్‌బాషాపై కేసు నమోదు చేయటం దారుణం అన్నారు. తాడిపత్రిలో ఉండొద్దంటూ ఆంక్షలు విధించటం సరికాదన్నారు. ఫయాజ్‌బాషాకు భద్రత కల్పించి తాడిపత్రికి పంపుతామని ఎస్పీ హామీ ఇచ్చారని తెలిపారు. ఇఫ్తార్ విందు ఇస్తానని ఫయాజ్‌బాషా ప్రకటించాకే జేసీ వర్గీయులు దాడి చేశారని వివరించారు. ఫయాజ్ ఇఫ్తార్ విందు ఇస్తే జేసీకి సమస్య ఏంటి అని ప్రశ్నించారు. తాడిపత్రితో టీడీపీ దౌర్జన్యాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫయాజ్‌బాషా మాట్లాడుతూ... జేసీ ప్రభాకర్‌రెడ్డి తనపై కక్షసాధింపుతో వ్యవహరిస్తున్నారని అన్నారు. పోలీసుల సమక్షంలోనే జేసీ ప్రభాకర్‌రెడ్డి రాళ్లతో దాడులు చేయించారని ఆరోపించారు. ఆయన నుంచి తన కుటుంబానికి ప్రాణహాని ఉందని పేర్కొన్నారు.

నేడు, రేపు పన్నుల చెల్లింపునకు అవకాశం

అనంతపురం క్రైం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖ పరిధిలో వార్షిక సంవత్సరం చివరి రోజు సెలవులు ఉన్నా, ఆన్‌లైన్‌లో పన్ను చెల్లించడానికి అవకాశం కల్పించామని ఆ శాఖ జిల్లా జాయింట్ కమిషనర్ శేషాద్రి శనివారం తెలిపారు. ఆదివారం, సోమవారం ఉగాది, రంజాన్ పండుగలున్నా, పన్నుదారులు జిల్లా కేంద్రంలో పన్నుల శాఖ కార్యాలయంలో పన్ను చెల్లించవచ్చని తెపాఆరు. సిబ్బంది పరిమితంగా అందుబాటులో ఉంటారని అన్నారు. అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ అందుబాటులో ఉంటారని, ఏమైనా సందేహాలుంటే సమాధానం ఇస్తారని తెలిపారు.

13న గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

అనంతపురంరూరల్,మార్చి29(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదు, ఇంటర్‌మొదటి సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13న నిర్వహిస్తున్న కురుగుంట కళాశాల ప్రిన్సిపాల్ నాగజ్యోతి తెలిపారు. ఆమేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వాస్తవానికి ఏప్రిల్ 6న పరీక్ష నిర్వహించాల్సి ఉండగా ప్రభుత్వం వాయిదా వేసిందన్నారు.

రేపటి వరకే తొలివిడత

ఉచిత సిలిండర్‌కు చివరి అవకాశం

జిల్లాలో 5,05,831 మంది అర్హులు

ఇప్పటి వరకు 4,17,502 మంది వినియోగం

ఖాతాల్లోకి రూ.33.52 కోట్లు జమ

ఇంకా 88,329 మంది దూరం



అనంతపురం టౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న గ్యాస్ సిలిండర్ల మొదటి విడతకు సోమవారంతో గడువు ముగుస్తుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీపం-2 పథకాన్ని ప్రారంభించారు. నాలుగు నెలలుకు ఒక ఉచిత సిలిండర్ ఇవ్వడానికి ప్రభుత్వం షెడ్యూల్ ఇచ్చింది. గతేడాది డిసెంబరులో ఉచిత సిలిండర్లు పంపిణీకి శ్రీకారం చుట్టారు. గ్యాస్ బుక్ చేసుకుని సిలిండర్‌ను పంపిణీ చేసిన 24 గంటల్లో తిరిగి వారిఖాతాల్లోకి ఆ సొమ్మును ప్రభుత్వం జమచేస్తూ వస్తోంది. డిసెంబరు నుంచి మార్చి 31వ తేదీ వరకు తొలి ఉచిత సిలిండర్‌కు అవకాశం ఇచ్చారు.

4,17,502 మందికి రూ. 33.52 కోట్లు జమ

అనంతపురం జిల్లాలో అధికారిక లెక్కల మేరకు 6,66,330 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో నిబంధనల మేరకు 5,05,831 మందిని ఉచిత వంటగ్యాస్ పొందడానికి అర్హులుగా గుర్తించారు. వీరిలో ఇప్పటి వరకు 4,17,502 మంది తొలి సిలిండర్‌ను బుక్‌చేసుకొని వినియోగించుకున్నారు. వీరందరికి ప్రభుత్వం ఒక్కో సిలిండర్‌కు రూ.869 చొప్పున వారి ఖాతాల్లోకి జమచేసింది. ఇప్పటి వరకు మొత్తం రూ. 33,52,70,710 జమచేసింది.

88,329 మంది దూరం..

ఉచిత తొలి సిలిండర్ పొందడానికి సోమవారం వరకు మాత్రమే అవకాశం ఉంది. అధికారుల రికార్డుల మేరకు ఇంకా జిల్లాలో 88,329 మంది అర్హత ఉన్నా ఉచిత సిలిండర్ తీసుకోలేదు. వీరందరు తొలి ఉచిత గ్యాస్‌సిలిండర్ పొందాలంటే ప్రభుత్వ నిబంధనల మేరకు ఈనెల 31వతేదీలోగా బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.

రేపే చివరి రోజు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం మార్చి 31వ తేదీ వరకు ఉచిత గ్యాస్‌సిలిండర్ పొందడానికి అవకాశం ఉంది. ఇప్పటి వరకు జిల్లాలో ఇంకా 88,329 మందికి తొలిసిలిండర్ పొందడానికి అర్హత ఉంది. వీళ్లందరు సోమవారం లోపు తప్పనిసరిగా బుక్ చేసుకోవాలి. అపుడే ప్రభుత్వం ఆ డబ్బును వారి ఖాతాల్లోకి జమచేస్తుంది. తర్వాత బుక్‌చేసుకుంటే తొలి ఉచిత సిలిండర్ వారికి వర్తించదు. రెండో సిలిండర్‌కు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.

- జగన్నాథ్‌రావు, ఇన్‌చార్జ్ డీఎస్‌ఓ

మండుతున్న ఎండ

సాధారణం కంటే 2-3 డిగ్రీలు పెరిగిన ఉష్ణోగ్రత

బొమ్మనహాల్‌లో 42.29డిగ్రీలు సెల్సియస్ నమోదు

రాబోయే రోజుల్లో మరింత వేసవి తాపం

బుక్కరాయసముద్రం మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో మార్చిలోనే ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగలతో జనాలు విలవిల్లాడుతున్నారు. ఉదయం 8గంటలకే ఎండల తీవ్రత పెరుగుతోంది. సాయంత్రం 6గంటల వరకు తీవ్ర వడగాడ్పులు వీస్తున్నాయి. ఈ ఏడాది మార్చి నుంచే పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీలు సెల్సియస్ ఎక్కువగా నమోదవుతున్నాయి. రానున్న ఏప్రిల్, మే మాసాలలో ఎండలు మరింత పెరగనున్నట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణస్వామి తెలిపారు. జిల్లాలో మార్చి చివరి వారం, ఏప్రిల్ మొదటి వారాల్లో సాధారణంగా 38-39.5 డిగ్రీలు సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవ్వాలి. అయితే శనివారం బొమ్మనహాళ్‌లో 42.29 డిగ్రీలు సెల్సియస్ నమోదయ్యింది. రాత్రి సమయంలో కనిష్ట ఉష్ణోగ్రతలు 20-21 డిగ్రీలు ఉండాలి. అలాంటిది 24 డిగ్రీలు సెల్సియస్ నమోదువుతున్నాయి. దీంతో రాత్రి సమయాల్లో ఉక్కపోత బాగా పెరి గింది. ఉదయం 9 గంటలు దాటితే ఇంటి నుంచి బయటకు రావడానికి భయపడే పరిస్థితి. మధ్యాహ్నం వేళల్లో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. ఈ ఏడాది వేసవిలో రికార్డు స్థాయిలో పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఆచార్యఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు.



ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి

బయటకు వెళితే ఎండ. ఇంట్లో ఉంటే ఉక్కపోత. దీంతో ప్రజలు ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు అల్లాడిపోతున్నారు. ఉష్ణోగ్రతలు అత్యధికస్థాయికి చేరుకోవడంతో ఫ్యాన్లు, కూలర్లు కూడా సరిపోవడం లేదు. బయటకు వచ్చిన సమయంలో గొడుగులు, టవళ్లు, టోపీలతో ఎండ నుంచి ఉపశమనం పొందుతున్నారు. ఎండ, వడగాడ్పుల తీవ్రత కు వడదెబ్బ తగిలే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, బయటకు వెళ్లవద్దని చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు ఇలా..

● అనంతపురం జిల్లాలో... అత్యధికంగా బొమ్మనహాళ్ 42.29, గుంతకల్లు 42.03, యల్లనూరు41.11, విడపనకల్లు41, శింగనమల 40.9 డిగ్రీలు సెల్సియస్ నమోదు అయ్యాయి.

● శ్రీ సత్యసాయి జిల్లాలో... కొత్తచెరువులో 41.2, సీకేపల్లి 41.2 తాడిమర్రి 41.1, ముదిగుబ్బ 41. కనగానపల్లి 40.07 డిగ్రీలు సెల్సియస్ నమోదు అయ్యాయి.

నెలాఖరులోపు పన్ను వసూలు: డీపీఓ



ఇంటర్వ్యూ interview

అనంతపురం న్యూటౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పంచాయతీల్లో నెలాఖరులోపు వంద శాతం పన్ను వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజనాయుడు పేర్కొన్నారు. పంచాయతీల్లో పన్ను వసూళ్లు, సిబ్బంది పనితీరు, పారిశుధ్యం తదితర అంశాలపై ఆయన వివరించారు.

ప్రశ్న: పన్ను వసూళ్లపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..?

డీపీఓ: జిల్లాలోని 31 మండలాల్లోని అన్ని గ్రామ పంచాయతీల్లో నెలాఖరులోపు వందశాతం పన్ను వసూలు చేయాల్సిందే. ఇప్పటికే కొన్ని చిన్న పంచాయతీల్లో 90 శాతం వరకు టార్గెట్ పూర్తి చేశాం. కొన్ని మేజర్ పంచాయితీల్లో డిమాండ్ ఎక్కువ ఉండటం, సిబ్బందికి ఇతర అదనపు పనులు ఉండటం వల్ల కొంత వెనుకబడి ఉన్నారు.

ప్రశ్న: విధులకు డుమ్మా కొట్టేవారిపై ఎలాంటి చర్యలు చేపడతారు?

డీపీఓ: పలు పంచాయితీల్లో సిబ్బంది సమయపాలన పాటించడం లేదన్న ఫిర్యాదులు ఉన్నాయి. అందుకు ప్రధాన సాక్ష్యం బయోమెట్రిక్ హాజరే. అందులో నిర్లక్ష్యం వహించిన వారికి ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారి చేసి వివరణ కోరాం. రిపీట్ అయితే క్రమశిక్షణ చర్యలు తప్పవు.

ప్రశ్న: పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

డీపీఓ: జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం పూర్తి స్థాయిలో మెరుగుపడాలి. ప్రత్యేక నిఘా ఉంచి మెరుగుకు తగిన చర్యలు చేపడతాం. కార్యదర్శులకు, ఈఓఆర్డీలకు పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించాం.

ప్రశ్న: కార్యదర్శులపై ఉన్న పని ఒత్తిడికి ప్రత్యామ్నాయ చర్యలు ఏవి?

డీపీఓ: పంచాయతీల్లో ప్రస్తుతం సచివాలయ వ్యవస్థ అమలుతో సిబ్బంది పెరిగినప్పటికి కార్యదర్శులకు మాత్రం పని ఒత్తిడి అయితే పెరిగింది. అయితే అందుకు అనుగుణంగా ప్రణాళిక తయారు చేసుకొని ఒత్తిడి తగ్గించుకొనేలా క్షేత్రస్థాయిలో కార్యదర్శులు తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఏ విభాగానికి సంబంధించిన సర్వే ఆ విభాగ సిబ్బంది ద్వారా చేయిస్తే కార్యదర్శులు వారు చేయాల్సిన ట్యాక్స్ కలెక్షన్స్, పారిశుధ్యంపై దృష్టి సారించే అవకాశం ఉంది.

శ్రీ విశ్వవసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు

మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1 పాదం)

ఆదాయం : 2, వ్యయం :14, రాజపూజ్యం :5, అవమానం :7

మేషరాశి వారికి ఈ ఏడాది ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఉద్యోగం, వ్యాపారాల్లో అభివృద్ధి కనిపిస్తుంది. గృహనిర్మాణం, స్థలసేకరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. విదేశాలకు చదువుల కోసం వెళ్లేందుకు, విదేశీ ఉద్యోగాల కోసం చేసే ప్రయత్నాలు సఫలం అవుతాయి. వివాహాది శుభకార్యాలు చేస్తారు. జనసంబంధాలు విస్తరిస్తాయి. బాంధవ్యాలు పెంపొందుతాయి. ఖర్చులు అంచనాలు మించుతాయి. ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. మీ జన్మరాశి నుంచి 2, 3 స్థానాల్లో గురుగ్రహ సంచారం కారణంగా స్థిరచరాస్తులు, విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. వ్యాపారాల్లో లాభాలకు, ఉద్యోగంలో పురోగతికి అవకాశం ఉంది. శత్రువులు సైతం మిత్రులుగా మారతారు. కుటుంబ వ్యవహారాలు ఆనందం కలిగిస్తాయి. విద్యార్థులు లక్ష్యాలు సాధిస్తారు. తోబుట్టువుల వ్యవహారాల్లో శుభ పరిణామాలు సంభవిస్తాయి. విద్యా సంస్థలు, కన్సల్టెన్సీ, ఏజెన్సీల వారికి శుభప్రదం. కోర్టు వ్యవహారాలు చికాకు కలిగిస్తాయి. సంవత్సరం ప్రారంభం నుంచి ఫిబ్రవరి 5 వరకు, ఆ తరువాత నవంబరు 12 నుంచి సంవత్సరాంతం వరకు గురువు వక్రగమనంలో ఉంటాడు. ఆ సమయంలో ఆర్థిక విషయాల్లో తొందరపాటు తగదు. ఉద్యోగ, వ్యాపారాల్లో నిదానం పాటించాలి. రవాణా, కన్సల్టెన్సీ విద్యారంగాల వారు జాగ్రత్తగా ముందడుగు వేయాలి. శ్రీఆంజనేయ స్వామి ఆరాధన శుభఫలితానిస్తుంది.

వృషభం (కృత్తిక 2,3,4: రోహిణి: మృగశిర 1,2 పాదాలు)

ఆదాయం : 11 వ్యయం :5 రాజపూజ్యం :1, అవమానం :3

వృషభ రాశి వారు ఈ ఏడాది అన్ని రంగాల్లో విజయం సాధిస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. ప్రమోషన్లు అందుకుంటారు. వ్యాపార రంగంలో ఉన్న వారు పురోగతి సాధిస్తారు. సంతానం విషయంలో శుభపరిణామాలు చోటుచేసుకుంటాయి. స్నేహానుబంధాలు పెంపొందుతాయి. రాజకీయ, సినీరంగాలు, వ్యవసాయ రంగంలోని వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆరోగ్యం మెరుగుపడుతుంది. కోర్టు వ్యవహారాలు సంవత్సరాంతంలో పరిష్కారం అవుతాయి. విలాసాలకు ఖర్చులు అధికం. ఈ ఏడాది గురువు మీ జన్మరాశితో పాటు 2వ స్థానంలో సంచరిస్తాడు. ఫలితంగా మీ కీర్తి ప్రతిష్ఠలకు భంగం కలిగే ప్రమాదం ఉంది. పై అధికారుల నుంచి ఒత్తిడిని ఎదుర్కొంటారు. ఇతరుల నుంచి మాటపడాల్సి రావచ్చు. జనవరి 1 నుంచి ఫిబ్రవరి 5 వరకు, ఆ తరువాత నవంబర్ 12 నుంచి సంవత్సరాంతం వరకు గురువు వక్రగమనంలో ఉంటాడు. ఆ సమయంలో సృజనాత్మక ప్రతిభతో వినూత్నమైన ప్రాజెక్టులు చేపడతారు. ప్రమోషన్లకు అవకాశం ఉంది. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆరోగ్యం మెరుగుపడుతుంది. బాంధవ్యాలు బలపడతాయి. సంతతి విషయంలో శుభ పరిణామాలు సంభవం. విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక, రాజకీయ రంగాల వారికి పురోగతి కనిపిస్తుంది. కుటుంబం విస్తరిస్తుంది. రుణ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. రుణాలు మంజూరవుతాయి. శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆరాధన శుభప్రదం.

మిథునం (మృగశిర 3,4: ఆరుద్ర: పునర్వసు 1,2,3 పాదాలు)

ఆదాయం : 14 వ్యయం :2 రాజపూజ్యం :4, అవమానం :3

మిథున రాశి వారు ఈ ఏడాది ఆస్తులు పెంపొందించుకుంటారు. ఉద్యోగ, వ్యాపారాల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది. విదేశీ గమన ప్రయత్నాలు ఫలిస్తాయి. విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. కళాకారులు, పత్రికలు, టెలివిజన్, న్యాయవాదులు, జడ్జీలకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. వివాహాది శుభకార్యాలు జరుగుతాయి. ఉద్యోగ, వ్యాపారాల్లో నైపుణ్యంతో వ్యవహరించి లాభాలు, మంచి పేరు తెచ్చుకుంటారు. వైద్యం, అంతరిక్ష పరిశోధన రంగాల్లో ఉన్న వారికి అనుకూలం. ఆదాయం పెంపొందించుకుంటారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. గురువు ఈ ఏడాది వ్యయస్థానంతో పాటు మీ జన్మ స్థానంలో సంచారం చేస్తాడు. ఫలితంగా విద్య, న్యాయ, రాజకీయ, సినీ రంగాల వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. విలాసాలకు ఖర్చులు అధికం. దూరప్రయాణాలకు అనుకూలం. విద్యార్థులు, పరిశోధకులకు అనుకూల సమయం. కొత్త పరిచయాలు లాభిస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆస్తిపాస్తులు పెంపొందించుకుంటారు. జనవరి 1 నుంచి ఫిబ్రవరి 5 వరకు, నవంబరు 12 నుంచి సంవత్సరాంతం వరకు గురువు వక్రించినందున ప్రయాణాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆర్థిక విషయాల్లో ఆచితూచి ముందడుగు వేయాలి. కొత్త పరిచయాల కారణంగా అనుకోని చిక్కులు ఎదురవుతాయి. ఉద్యోగ, వ్యాపారాల్లో అనుకోని అవాంతరాలు ఎదురయ్యే అవకాశం ఉంది. శ్రీ ఇంద్రాక్షీ దేవి ఆరాధన శుభప్రదం.

కర్కాటకం (పునర్వసు 4: పుష్యమి, ఆశ్లేష)

ఆదాయం : 8 వ్యయం : 2 రాజపూజ్యం : 7 అవమానం :6

కర్కాటక రాశి వారు ఈ ఏడాది ఆస్తులు పెంపొందించుకుంటారు. ఆర్థికంగా పురోగతి సాధిస్తారు. ఉద్యోగ, వ్యాపారాల్లో అభివృద్ధి కనిపిస్తుంది. కొత్త వ్యాపారాలు ప్రారంభించి విజయం సాధిస్తారు. ప్రముఖులతో పరిచయాలు లాభిస్తాయి. గౌరవ, ప్రతిష్ఠలు పెంపొందుతాయి. సినిమాలు, రాజకీయ, బోధన, న్యాయ, పరిశోధన, పత్రికారంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. శుభకార్యాలు జరుగుతాయి. దంపతులు అన్యోన్యంగా ఉంటారు. సంతానం విషయంలో మంచి పరిణామాలు చోటుచేసుకుంటాయి. విదేశీ గమన యత్నాలకు అనుకూలం. గురువు ఈ ఏడాది 11, 12 స్థానాల్లో సంచరిస్తున్న ఫలితంగా ఆదాయం పెరుగుతుంది. వృత్తి, వ్యాపారాల్లో పురోగతి సాధిస్తారు. కొత్త ఆలోచనలు అమలు చేసి విజయం సాధిస్తారు. రుణాలు మంజూరవుతాయి. వివాహ యత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగం చేస్తూ వేరే వ్యాపారం ద్వారా ఆదాయం పెంచుకునేందుకు ప్రయత్నించి విజయం సాధిస్తారు. డిజైనర్లు, పరిశోధనలు, ప్రచురణలు, న్యాయ, సినీ, రాజకీయ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహం లభిస్తుంది. జనవరి 1 నుంచి ఫిబ్రవరి 5 వరకు, నవంబర్ 12 నుంచి సంవత్సరాంతం వరకు గురువు వక్రించి ఉండటంతో ఈ సమయంలో విదేశీ గమన ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉంది. వ్యాపారంలో ఒడిదుడుకులు ఎదుర్కొంటారు. ఉన్నత చదువుల కోసం ఖర్చులు అధికం. కొత్త ఆలోచనలు అమలు చేసే విషయంలో ఆచితూచి వ్యవహరించాలి. శ్రీరామచంద్రమూర్తి ఆరాధన వల్ల శుభం కలుగుతుంది.







సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పాదం)

ఆదాయం : 11 వ్యయం : 11రాజపూజ్యం : 3 అవమానం :6

సింహ రాశి వారు ఈ ఏడాది వ్యాపార రంగంలో లాభాలు ఆర్జిస్తారు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగులు ప్రమోషన్లు అందుకుంటారు. ఆర్థికంగా ప్రోత్సాహకరంగా ఉంటుంది. విదేశీ యత్నాలు ఫలిస్తాయి. వైవాహిక జీవితం ఆనందంగా సాగుతుంది. బాంధవ్యాలు పెంపొందుతాయి. ఉద్యోగ, వ్యాపారాల్లో ఊహించని చిక్కులు ఎదురవుతాయి. ఆస్తి నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. గౌరవ మర్యాదలకు భంగం కలుగుతుంది. పై అధికారుల నుంచి మాటపడాల్సి రావచ్చు. కొత్త వ్యాపారాలను కొంతకాలం వాయిదా వేసుకోవడం మంచిది. గురుగ్రహం ఈ ఏడాది మీ జన్మ రాశి నుంచి 10, 11 స్థానాల్లో సంచరిస్తుంది. ఫలితంగా ఉద్యోగ, వ్యాపారాలలో కొన్ని చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఆస్తినష్టం జరుగుతుంది. శతృబాధ అధికం. ఉద్యోగులు పై అధికారుల నుంచి మాటపడాల్సి వస్తుంది. అనవసర ఖర్చులు పెరుగుతాయి. కొత్త వ్యాపార ప్రయత్నాలకు ఇది తగిన సమయం కాదు. పెద్దల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాలి. ఏడాది ప్రారంభం నుంచి ఫిబ్రవరి మొదటి వారం వరకు, ఆ తరువాత నవంబర్ 12 నుంచి సంవత్సరాంతం వరకు ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి. అదనపు ఆదాయయత్నాలు విజయవంతం అవుతాయి. వ్యాపార రంగంలోని వారు లాభాలు అందుకుంటారు. అధికారం, హోదా, గౌరవ ప్రతిష్ఠలు పెరుగుతాయి. శ్రీ దుర్గాదేవి ఆరాధన శుభప్రదం.

కన్య (ఉత్తర 2,3,4: హస్త: చిత్త 1,2 పాదాలు)

ఆదాయం :14 వ్యయం : 2 రాజపూజ్యం : 6 అవమానం :6

2025లో కన్యారాశి వారికి ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉన్నత చదువులకు అనుకూలం. వ్యాపారంలో లాభాలు ఆర్జిస్తారు. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తిలో ఉన్నత పదవులు అందుకుంటారు. నూతన భాగస్వామ్యాలు లాభిస్తాయి. కీర్తి ప్రతిష్ఠలు పెంపొందుతాయి. ప్రత్యర్థులు కూడా సఖ్యతతో వ్యవహరిస్తారు. జన సంబంధాలు విస్తరిస్తాయి. ఇంట్లో వివాహాది శుభకార్యాలు జరుగుతాయి. దాంపత్య జీవితం ఆనందమయంగా సాగుతుంది. ఆరోగ్యం మెరుగుపడుతుంది. షేర్‌మార్కెట్ లావాదేవీలలో దూకుడు తగ్గించాలి. గురువు 9, 10 స్థానాల్లో సంచారం చేయడం వల్ల ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. వృత్తి, వ్యాపారాల్లో శుభపరిణామాలుంటాయి. ప్రమోషన్లు సాధిస్తారు. వ్యాపార విస్తరణకు అనుకూలం. న్యాయ, ఆధ్యాత్మిక, బోధన, పత్రికలు, పోలీసులు, మిలటరీ, కన్సల్టెన్సీ, ఆడిటింగ్, కళా రంగాల వారికి ప్రోత్సాహకరం. సంతానప్రాప్తికి అనుకూలం. రవాణా, ప్లానింగ్, శిక్షణ రంగాల వారు లక్ష్యాలు సాధిస్తారు. రాజకీయ రంగంలోని వారికి ఉన్నత పదవులు లభిస్తాయి. నవంబర్ 12 నుంచి ఏడాది చివరి దాకా మీ పురోగతి చూసి అసూయపడేవారు పెరుగుతారు. పెట్టుబడుల్లో జాగ్రత్త వహించాలి. ఈ ఏడాది 6, 7 స్థానాల్లో శని సంచారం ఫలితంగా న్యాయరంగంలోని వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. శ్రీ దత్తాత్రేయ స్వామి ఆరాధన శుభఫలితాలనిస్తుంది.

తుల (చిత్త 3,4: స్వాతి: విశాఖ 1,2,3 పాదాలు)

ఆదాయం :11 వ్యయం : 5 రాజపూజ్యం : 2 అవమానం :2

తులా రాశి వారు 2025లో ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తారు. ఆస్తులు పెంపొందించుకుంటారు. ఉద్యోగ, వ్యాపారాల్లో అభివృద్ధి కనిపిస్తుంది. పైచదువులు చదివేందుకు, విదేశీ గమనానికి అనుకూలం. గృహనిర్మాణ యత్నాలు ఫలిస్తాయి. వివాహయత్నాలు సఫలమవుతాయి. వైద్యం, ఫార్మా, ప్రకటనలు, కన్సల్టెన్సీలు, ఏజెన్సీలు, రాజకీయ, కళ, సినీ, రక్షణ, విద్య ఐ.టీ. రంగాల వారికి ప్రోత్సాహకరం. రుణ యత్నాలు ఫలిస్తాయి. అనుకున్న పనులు ఓరిమితో పూర్తి చేస్తారు. ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఉద్యోగం చేస్తూ చిన్న వ్యాపారం చేసేందుకు అనుకూలం. షేర్ మార్కెట్ లావాదేవీల్లో ఫలితాలు మధ్యమంగా ఉంటాయి. ఈ సంవత్సరం గురువు 8, 9 స్థానాల్లో సంచరిస్తున్న ఫలితంగా ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఉన్నత చదువుల కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. అయితే అందుకోసం అధికంగా ఖర్చులు చేయాల్సి వస్తుంది. న్యాయ వివాదాల్లో విజయం సాధిస్తారు. విద్యార్థులకు అనుకూలం. ఆస్తి వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. నవంబరు 12 నుంచి రుణదాతల నుంచి ఒత్తిడి పెరుగుతుంది. మీ గౌరవ ప్రతిష్ఠలకు భంగం కలిగే అవకాశం ఉంది. విద్యార్థుల చదువులు మందకొడిగా సాగుతాయి. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాలి. వైద్యం, ఔషధ రంగాల వారు ఆచితూచి వ్యవహరించాలి. బంధుమిత్రుల నుంచి మాటపడాల్సి రావచ్చు. శని ఈ సంవత్సరం 5, 6 స్థానాల్లో సంచరిస్తున్న ఫలితంగా రక్షణ, సైనిక రంగాల వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆరాధన శుభఫలితాలనిస్తుంది.

వృశ్చికం (విశాఖ 4, అనూరాధ, జ్యేష్ఠ)

ఆదాయం : 2 వ్యయం : 14 రాజపూజ్యం : 5 అవమానం :2

వృశ్చిక రాశి వారికి ఈ ఏడాది ఆదాయం పెంపొందుతుంది. సంకల్పం సిద్ధిస్తుంది. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఉద్యోగ, వ్యాపారాల్లో అభివృద్ధి కనిపిస్తుంది. వివాహాది శుభకార్యాలు జరుగుతాయి. ప్రత్యర్థులపై విజయం సాధిస్తారు. ఆరోగ్యం మెరుగుపడుతుంది. వాహనం కొనుగోలు చేస్తారు. బ్యాంకు డిపాజిట్లు, షేర్ల లావాదేవీలపై మంచి ప్రతిఫలాలు అందుకుంటారు. కొత్త పరిచయాలు వల్ల లబ్ధి పొందుతారు. న్యాయ విషయాల్లో విజయం సాధిస్తారు. భాగస్వాముల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వారసత్వ సమస్యలు పరిష్కారం అవుతాయి. ఈ ఏడాది 7, 8 స్థానాల్లో గురుసంచారం ఫలితంగా వివాహాది శుభకార్యాలు జరుగుతాయి. వ్యాపార విస్తరణ యత్నాలు ఫలిస్తాయి. స్నేహితులు, బంధువులు లక్ష్య సాధనలో సహకరిస్తారు. స్పెక్యులేషన్లు, షేర్ల లావాదేవీల్లో లాభాలు గడిస్తారు. రుణాలు తీర్చగలుగుతారు. ఉమ్మడి వ్యాపారం కలిసివస్తుంది. విద్యార్థులకు శుభప్రదమైన కాలం. విదేశీ ప్రయాణాలు చేస్తారు. ప్రకటనలు, ఏజెన్సీ రంగాల వారికి అనుకూలం. రాజకీయ, సినీ, రవాణా, విద్య ఐ.టీ. రంగాల వారికి ప్రోత్సాహకరం. గురువు వక్ర గమనంలో ఉన్న జనవరిలో ఆ తరువాత నవంబరు 12 నుంచి ఏడాది చివరి వరకు వైవాహిక జీవితంలో చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉంది. వ్యాపారంలో ఇబ్బందులు ఎదురవుతాయి. ఆర్థిక విషయాల్లో జాగ్రత. శ్రీ లక్ష్మీగణపతి ఆరాధన శుభ ఫలితాలనిస్తుంది.







ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పాదం)

ఆదాయం : 5 వ్యయం : 5 రాజపూజ్యం : 1 అవమానం :5

ధనుస్సు రాశి వారికి 2025లో స్థిరాస్తి సమకూర్చుకునే ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగ, వ్యాపారాల్లో అభివృద్ధి సాధిస్తారు. కష్టానికి తగిన ప్రతిఫలం అందుకుంటారు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. వివాహయత్నాలు ఫలిస్తాయి. విద్యార్థులకు శుభప్రదం. బ్యాంకింగ్, షేర్ మార్కెట్ రంగాల వారికి ప్రోత్సాహకరం. పెద్దల ఆరోగ్యం మెరుగుపడుతుంది. సంతానం విషయంలో శుభపరిణామాలు సంభవం. కుటుంబ సభ్యుల సహకారం అందుతుంది. రుణ సమస్యలు పరిష్కారం అవుతాయి. వృత్తి, వ్యాపారాల్లో పట్టుదలతో లక్ష్యాలు సాధిస్తారు. మీ జన్మరాశి నుంచి 6, 7 స్థానాల్లో గురు సంచారం ఫలితంగా ఉద్యోగ, వృత్తి, వ్యాపారాల్లో పురోగతి కనిపిస్తుంది. ఆత్మవిశ్వాసంతో చేసే యత్నాలు సఫలమవుతాయి. వ్యవసాయం, పరిశ్రమల రంగాల వారికి అనుకూలం. హోటల్, ఆహార ఉత్పత్తులు, ఔషధాలు, ఆస్పత్రులు, కేటరింగ్, నిత్యావసరాల రంగాల వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి. ఇంట్లో శుభకార్యాలు జరుగుతాయి. ప్రత్యర్థులపై విజయం సాధిస్తారు. న్యాయ వివాదాలు పరిష్కారం అవుతాయి. ఉమ్మడి వ్యాపారం లాభిస్తుంది. కుటుంబ సమస్యలు ఒక కొలిక్కి వస్తాయి. సంతానప్రాప్తికి అవకాశం ఉంది. ఉన్నత చదువుల్లో విజయం సాధిస్తారు. స్నేహ బాంధవ్యాలు పెరుగుతాయి. రుణాలు తీరుస్తారు. జనవరిలో, ఆ తరువాత నవంబరు 12 నుంచి సంవత్సరాంతం వరకు సన్నిహితుల నుంచి మాటపడాల్సి వస్తుంది. శ్రీ పార్వతీదేవి ఆరాధన శుభప్రదం.

మకరం (ఉత్తరాషాఢ 2,3,4: శ్రవణం: ధనిష్ఠ 1,2 పాదాలు)

ఆదాయం : 8 వ్యయం :14 రాజపూజ్యం : 4 అవమానం :5

మకర రాశి వారు ఈ సంవత్సరం ఉద్యోగ, వ్యాపారాల్లో సత్ఫలితాలు సాధిస్తారు. ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి. భూమి కొనుగోలు చేస్తారు. బదిలీలకు అనుకూలం. పెద్దల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వివాహాది శుభకార్యాలు జరుగుతాయి. సంతాన ప్రాప్తికి అనుకూలం. ఆరోగ్యం మెరుగుపడుతుంది. వ్యాపారంలో లాభాలు గడిస్తారు. కొత్త కోర్సులు చదివి ఉద్యోగంలో రాణిస్తారు. రుణాలు తీరుస్తారు. వృషభ, మిథున రాశుల్లో గురువు సంచారం వల్ల ఈ ఏడాది ఉన్నత విద్యాయత్నాలు ఫలిస్తాయి. వాయిదాపడుతున్న పనులు పూర్తి చేస్తారు. ఆర్థిక విషయాల్లో పట్టుదలతో వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. మీ ప్రతిభకు తగిన అవకాశాలు లభిస్తాయి. శాస్త్ర, విజ్ఞానరంగాల వారికి ప్రోత్సాహకరం. పిల్లల విద్య, వృత్తి, వివాహ విషయాలలో అభివృద్ధి కనిపిస్తుంది. స్నేహానుబంధాలు బలపడతాయి. బ్యాంకింగ్, ఫైనాన్స్, విద్యాసంస్థలు, సినిమాలు, ప్రకటనలు, టెలివిజన్, క్రీడలు, సృజనాత్మక రంగాల వారు సత్ఫలితాలు సాధిస్తారు. ప్రభుత్వ ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. గురువు వక్ర గమనంలో ఉన్న జనవరితో పాటు నవంబర్ 12 నుంచి సంవత్సరాంతం వరకు విద్యార్థులు చదువుల పట్ల అశ్రద్ధ చూపే అవకాశం ఉంది. ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి. లక్ష్య సాధనలో పెద్దల సహకారం లోపిస్తుంది. ఆర్థిక సమస్యలు తలెత్తవచ్చు. మీ జన్మ రాశి నుంచి 2, 3 స్థానాల్లో శని సంచారం వల్ల బదిలీలు, సీట్ల మార్పిడి ప్రయత్నాల్లో విజయం సాధిస్తారు. శ్రీ హయగ్రీవ స్తోత్ర పారాయణ శుభఫలితాలనిస్తుంది.

కుంభం (ధనిష్ఠ 3,4 : శతభిషం: పూర్వాభాద్ర 1,2,3 పాదాలు)

ఆదాయం : 8 వ్యయం :14 రాజపూజ్యం : 7 అవమానం :1

కుంభ రాశి వారు 2025లో ఆస్తిపాస్తులు సమకూర్చుకుంటారు. వాహనయోగం ఉంది. విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారు. వ్యాపారంలో లాభాలు ఆర్జిస్తారు. జీతభత్యాలు పెరుగుతాయి. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. గృహ నిర్మాణం, రియల్ ఎస్టేట్, నిర్మాణ సామగ్రి వ్యాపారులు పురోగతి సాధిస్తారు. కుటుంబ విషయాలు ఉల్లాసం కలిగిస్తాయి. పెద్దల ఆరోగ్యం మెరుగవుతుంది. స్నేహానుబంధాలు బలపడతాయి. అందరినీ ఆకట్టుకుని లక్ష్యాలు సాధిస్తారు. ఈ ఏడాది 4, 5 స్థానాల్లో బృహస్పతి సంచరిస్తున్న ఫలితంగా విలువైన వస్తువులు, ఆభరణాలు, స్థిరచరాస్తులు సమకూర్చుకుంటారు. ఇంట్లో వేడుకలు, వివాహాది శుభకార్యాలు జరుగుతాయి. పెద్దల ఆరోగ్యం మెరుగుపడుతుంది. స్థల సేకరణ, గృహ నిర్మాణానికి అనుకూలం. స్టీలు, సిమెంట్ ఇతర నిర్మాణ సామగ్రి వ్యాపారులు, ఫర్నిచర్ రంగాల వారు లాభాలు అందుకుంటారు. పై చదువుల కోసం చేసే యత్నాలు ఫలిస్తాయి. న్యాయ పోరాటాల్లో విజయం సాధిస్తారు. గురువు వక్రగమనంలో ఉండే జనవరి మాసంతో పాటు నవంబర్ 12 నుంచి ఏడాది చివరి వరకు రియల్ ఎస్టేట్, గృహనిర్మాణ రంగాల వారు ఆచితూచి వ్యవహరించాలి. ఆర్థిక విషయాల్లో ప్రతికూలత కనిపిస్తుంది. కుటుంబసభ్యుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. న్యాయపరమైన సమస్యలు తలెత్తవచ్చు. పై అధికారుల నుంచి ఒత్తిళ్లు పెరుగుతాయి. శ్రీ వేంకటేశ్వరస్వామి ఆరాధన శుభప్రదం.

మీనం (పూర్వాభాద్ర 4 : ఉత్తరాభాద్ర, రేవతి)

ఆదాయం : 5 వ్యయం :5 రాజపూజ్యం : 3 అవమానం :1

మీన రాశి వారు ఈ ఏడాది విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. స్థిరాస్తులు సమకూర్చుకుంటారు. ఉద్యోగ, వ్యాపారాల్లో అభివృద్ధి కనిపిస్తుంది. కీర్తిప్రతిష్ఠలు పెంపొందుతాయి. విదేశాలకు వెళ్లే యత్నాలు ఫలిస్తాయి. టెలివిజన్, ప్రచురణ, మార్కెటింగ్, రవాణా, స్టేషనరీ, విద్యారంగంలోని వారికి ప్రోత్సాహకరం. విద్యార్థులు లక్ష్యాలు సాధిస్తారు. కాంట్రాక్టులు, ఒప్పందాలు లాభిస్తాయి. రుణాలు తీర్చగలుగుతారు. ఉద్యోగం చేస్తూ పై చదువుల కోసం ప్రయత్నించి విజయం సాధిస్తారు. బంధుమిత్రుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. గురువు 3, 4 స్థానాలలో సంచరిస్తున్న ఫలితంగా వృత్తి, వ్యాపారాల్లో శుభపరిణామాలుంటాయి. లక్ష్య సాధనలో సన్నిహితుల సహకారం అందుకుంటారు. స్టేషనరీ, రవాణా, పాఠశాలలు, మార్కెటింగ్ రంగాల వారికి ప్రోత్సాహకరం. విదేశీ ప్రయాణాలకు అనుకూలం. ఉద్యోగ వ్యాపారాల్లో చిన్నపాటి మార్పులు చేస్తారు. పెద్దల ఆరోగ్యం మెరుగుపడుతుంది. స్థిరాస్తులు సమకూర్చుకుంటారు. ఉద్యోగం చేస్తూ పై చదువులు చదివేందుకు అనుకూలం. ధార్మిక కార్యక్రమాల కోసం ఖర్చు చేస్తారు. రుణబాధలు ఒక కొలిక్కి వస్తాయి. గురువు వక్రగమనంలో ఉన్న జనవరి మాసంతో పాటు నవంబరు 12 నుంచి ఏడాది చివరి వరకు వృత్తి, వ్యాపారాల్లో కొంత నిరుత్సాహకరంగా ఉంటుంది. ఉద్యోగ యత్నాలకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉంది. గౌరవ మర్యాదలకు భంగం కలుగుతుంది. వాగ్వివాదాలకు దూరంగా ఉండాలి. శ్రీకృష్ణ భగవానుడి ఆరాధన శుభప్రదం.







ఊరూవాడా వేడుకలు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)
తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. పసుపు జెండాను ఆవిష్కరించారు. ఎన్టీఆర్‌కు ఘన నివాళులు అర్పించారు.


అనంతలో.. బీసీ సెల్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌కు నివాళి


పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ కార్పొరేటర్ రాజారావు


పాపంపేటలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు


సిండికేట్ నగర్‌లో...


ఆకుతోటపల్లిలో ...


అక్కంపల్లిలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న నాయకులు


కురుగుంటలో...


నారాయణపురంలో...


గార్లదిన్నెలో...


నార్పలలో...


బుక్కరాయసముద్రంలో...


శింగనమలలో...


గుమ్మేపల్లిలో...


ఆత్మకూరులో....


రామగిరిలో...


కనగానపల్లి మండలం వేపకుంటలో...


చెన్నేకొత్తపల్లి టీడీపీ కార్యాలయం వద్ద ఆవిర్భావ వేడుకల దృశ్యం

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం


సీనియర్ నాయకులను సన్మానిస్తున్న ఎంపీ అంబికా, వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, రాష్ట్ర నాయకులు ఆలం నరసానాయుడు, తలారి ఆదినారాయణ, జేఎల్ మురళి, గాజుల ఆదెన్న, ముంటిమడుగు కేశవరెడ్డి, గౌస్‌మొద్దీన్, దండు శ్రీనివాసులు, బుగ్గయ్య చౌదరి, స్వరూప, పోతులయ్య, విశాలాక్షి, స్వామిదాస్, కూచి హరి, సిమెంట్ పోలన్న, కుంచెపు వెంకటేష్, సుధాకర్ యాదవ్, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ క్యాంప్ కార్యాలయం వద్ద : నగర శివారులోని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ క్యాంప్ కార్యాలయంలో ఎంపీ అంబికా, టీడీపీ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అలాగే టీడీపీ బీసీ సెల్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. బీసీ సెల్ నాయకులు సిమెంట్ పోలన్న, కుంచెపు వెంకటేష్, పుల్లన్న, లక్ష్మన్న, సుధాకర్, భాస్కర్, తాతయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్ రాజారావు ఆధ్వర్యంలో స్థానిక 35,36వ డివిజన్లల్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. రాంనగర్‌లోని వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. స్థానిక ఐదో డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ సరళ ఆధ్వర్యంలో, ఆరో రోడ్డులో టీడీపీ నాయకులు ఓంకార్‌రెడ్డి, 18వ డివిజన్‌లో సైపుద్దీన్, జేఎం బాషా, 39 వ చేపల హరి, రెవెన్యూ కాలనీలో కల్పనా రాణి, అశోక్ నగర్‌లో వెంకటరామయ్య ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

పేదల కోసమే టీడీపీ స్థాపన

● ఎమ్మెల్యే పరిటాల సునీత


ఎన్టీఆర్, పరిటాల రవీంద్రకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు

రాప్తాడు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమం కోసం ఆనాడు ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. నియోజకవర్గ కేంద్రమైన రాప్తాడులోని టీడీపీ కార్యాలయంలో శనివారం టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీడీపీ నాయకులతో కలిసి పార్టీ జెండా ఆవిష్కరించారు. పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర చిత్రపటాలకు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన తరువాతే బీసీ, ఎస్సీ, ఎస్టీలు రాజకీయాల్లో రాణిస్తున్నారన్నారు. పరిటాల రవి మరణాంతరం పరిటాల కుటుంబానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అండగా ఉన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ సహకారంతో నియోజకవర్గంలో వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ప్రకాష్‌రెడ్డికి ఎమ్మెల్యే పరిటాల సునీత చాలెంజ్

పాపంపేట స్థలం విషయంలో పరిటాల కుటుంబ తప్పు చేసినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రకాష్‌రెడ్డికి చాలెంజ్ విసిరారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకపోతే నియోజకవర్గంలో తిరగనివ్వమని హెచ్చరించారు. రామగిరి ఎంపీపీ ఎన్నిక విషయంలో ఎనిమిది మంది ఎంపీటీసీలు వైసీపీకి చెందిన వారు ఉన్నప్పటికీ వారిని ఇతర రాష్ట్రాలకు ఎందుకు తరలించావని ప్రకాష్‌రెడ్డిని ప్రశ్నించారు. పోలీసులపై ప్రకాష్‌రెడ్డి ఇష్టానుసారంగా మాట్లాడారని, దీనిపై పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. మండల ఇన్‌చార్జ్‌లు ధర్మవరపు మురళి, బాలాజీ, రాప్తా డు, అనంతపురం రూరల్ కన్వీనర్లు పంపు కొండప్ప, జింకా సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, రఘు, మాజీ కన్వీనర్ నారాయణస్వామి, సర్పంచులు తిరుపాలు, శీనయ్య, గంగలకుంట రమణ, మరూరు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఎంపీటీసీల ఇళ్ల వద్ద పోలీసు బందోబస్తు

రామగిరి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీపీ ఉప ఎన్నిక సందర్భంగా జరిగిన సంఘటనలను గుర్తించుకుని వైసీపీ ఎంపీటీసీల ఇళ్ల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు. గురువారం జరిగిన ఎంపీపీ ఉప ఎన్నికకు గైర్హాజరైన ఎంపీటీసీల ఇళ్ల వద్ద పోలీసులు ముందస్తుగా బందోబస్తు ఏర్పాటుచేశారు. గంతిమర్రి ఎంపీటీసీ బాలకొండయ్య, కుంటిమద్ది ఎంపీటీసీ సాయిలీల, ఎంసీపల్లి ఎంపీటీసీ ఆదిలక్ష్మి, కొండాపురం ఎంపీటీసీ కొండమ్మ, పోలేపల్లి ఎంపీటీసీ సుజాత ఇళ్ల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. వీరందరు శనివారం వారి ఇళ్లకు చేరుకున్నారు. వారు రాక మునుపే పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. సీఐ శ్రీధర్ , ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్ గ్రామాలలో తిరుగుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు.

ఆశా వర్కర్‌కు ఆర్థిక సాయం

శింగనమల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం నుంచి అదుపు తప్పి గాయపడ్డ శింగనమల ఆశా వర్కర్ పద్మావతికి తరిమెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది తరుపున ఆర్థిక సాయం అందజేశారు. 20 రోజుల కిందట గాయపడిన ఆమెను బెంగళూరుకు తరలించి ఆపరేషన్ చేయించారు. ప్రస్తుతం ఇంటికి వచ్చిన ఆమెకు తరిమెల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం తరుపున వైద్యాధికారి డాక్టర్ శంకర్‌నాయక్ రూ.80 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే శింగనమల మత్స్యకారుల సంఘం తరుపున రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

వారిని స్పాట్ నుంచి మినహాయించాలి : ఏపీటీఎఫ్

అనంతపురం విద్య, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక సమస్యలతో బాధపడుతున్న, 55 ఏళ్ల పైడిన ఉపాధ్యాయులను స్పాట్ డ్యూటీ నుంచి మినహాయించాలని ఏపీటీఎఫ్ నాయకులు డీఈఓ ప్రసాద్‌బాబును కోరారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్ ఇతర నేతలు శనివారం డీఈఓను జిల్లా సైన్స్ సెంటర్‌లో కలిసి వినతిపత్రం అందించారు.

రోడ్డు ప్రమాదంలో బేల్దారి మృతి

అనంతపురం క్రైం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): నగర శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆత్మకూరు మండలం యాలేరు గ్రామానికి చెందిన బేల్దారి ఎం.రామక్రిష్ణ (35), మరో ఇద్దరు ఇస్మాయిల్, ఎర్రిస్వామితో కలిసి శనివారం అనంతపురం నగరంలో ఓ ఇంటి నిర్మాణ పనులకు సంబంధించి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. నగర శివారులోని గుడ్‌చిల్డ్రన్స్ స్కూల్ సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన ఓ లారీ ద్విచక్రవాహనాన్ని ఢీ కొంది. దీంతో రామక్రిష్ణకు తీవ్రగాయాలు కాగా, ఎర్రిస్వామి, ఇస్మాయిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారిని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామక్రిష్ణ మృతి చెందాడు. కాగా ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారయ్యాడు. అనంతపురం రూరల్ పోలీసులు లారీని స్వాధీనం చేసుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏఐ, ఎంఎల్ కోర్సులదే భవిష్యత్తు : వీసీ

అనంతపురం సెంట్రల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ), మెషిన్ లర్నింగ్(ఎంఎల్) కోర్సులు నేర్చుకున్న విద్యార్థులదే భవిష్యత్ అని సెంట్రల్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి పేర్కొన్నారు. 'యాక్సిలరేట్ యువర్ ఏఐ జర్నీ - మెషిన్ లర్నింగ్ విత్ పైథాన్' అనే అంశంపై శనివారం వర్క్‌షాప్‌ను నిర్వహించారు. వీసీ ముఖ్య అతిథిగా హాజరై సదస్సును ప్రారంభించారు.

తెలుగువారి ఆత్మ గౌరవం కోసం పుట్టిన టీడీపీ

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ


నీలారెడ్డిపల్లిలో సీనియర్ కార్యకర్తలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

బుక్కరాయసముద్రం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెలుగువారి ఆత్మగౌరవం కోసం టీడీపీ ఆవిర్భవించిందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. మండల పరిధిలోని నీలారెడ్డిపల్లిలో శనివారం టీడీపీ 43వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ...43 సంవత్సరాలుగా తెలుగు ప్రజలు తమ గుండెల్లో పెట్టుకున్న పార్టీ టీడీపీ అని వ్యాఖ్యనించారు. టీడీపీ ఏర్పడిన అనంతరమే బీసీ, ఎస్సీ, ఎస్టీలు అభివృద్ధి చెందారన్నారు. టీడీపీ నాయకులు పసుపుల శ్రీరామిరెడ్డి, ఎంపీపీ సునీత, మాజీ జడ్పీటీసీ షాలిని, పార్టీ జిల్లా ఉపాధ్యాక్షుడు దేగల క్రిష్ణమూర్తి, నాయకులు చితంబరదొర, జీసీ బాబు, గుత్తా ఆదినారాయణ, ఓబులపతి, తలారి ఆది తదితరులు పాల్గొన్నారు.


కొట్టాల కొండయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

శింగనమల: టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీకి సేవలు అందించిన 50 మంది సీనియర్ నాయకులు, కార్యకర్తలను నగరంలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రావణిశ్రీ సన్మానించారు. నాయకులు మారుతినాయుడు, చితంబరిదొర తదితరులు పాల్గొన్నారు.

ప్రకాష్‌రెడ్డీ... నోరు అదుపులో పెట్టుకో..!

● మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై టీడీపీ నాయకులు ఫైర్

రామగిరి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకుని, సభ్యత సంస్కారంతో మాట్లాడాలని మండలంలోని యాదవసంఘం నాయకులు, టీడీపీ నాయకులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మండలంలోని గరిమేకలపల్లిలో శనివారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవాల అనంతరం పార్టీ సీనియర్ నాయకులు ఎల్ నారాయణచౌదరి స్వగృహంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. మాజీ వైస్ ఎంపీపీ ఆదినారాయణ, యాదవసంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, మాజీ సర్పంచ్ ఆంజనేయులు యాదవ్, గోపాల్ యాదవ్‌తో పాటు టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్, మాజీ సర్పంచ్‌ముత్యాలు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి విచక్షణ కోల్పోయి విధి నిర్వహణలో ఉన్న ఎస్‌ఐ సుధాకర్ యాదవ్‌తో పాటు పలువురు పోలీసు అధికారులను ఇష్టానుసారం మాట్లాడడం గర్హనీయమన్నారు. ప్రకాష్‌రెడ్డి వెంటనే పోలీసు అధికారులకు బేషరుతుగా క్షమాపణలు చెప్పాలని, లేనిపక్షంలో ఆయన ఇంటిని ముట్టడించడానికి వెనుకాడమని హెచ్చరించారు.

నిష్పక్షపాతంగా భద్రతా చర్యలు చేపట్టాం

● ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్

రామగిరి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ ఉప ఎన్నిక సందర్భంగా 27, 28 తేదీల్లో నిష్పక్షపాతంగా భద్రతాచర్యలు చేపట్టామని, మాజీ ఎమ్మెల్యే ఆరోపణలు అవాస్తవమన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వైసీపీ ఎంపీటీసీలను వారు ఉద్దేశ్యపూర్వకం గా ఆలస్యంగా తెచ్చారంటూ అందుకు సంబంధించిన ఆధారాలను ఎస్‌ఐ విడుదల చేశారు. ఎంపీటీసీ సభ్యులను సముద్రం ఒడ్డుకు తీసుకెళ్లి సోషల్ మీడియాలో ఫొటోలు పెట్టడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే అన్నారు. ప్రజలలో అనవసరమైన భయాందోళనను సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కల్గించారన్నారు. పెనుకొండ తహసీల్దార్ కార్యాలయం వద్దకు కూడా ప్రమాదకరంగా ప్రవర్తించడం, బూతులు తిడుతూ మాట్లాడటం హేయమైన చర్య అన్నారు. ఇద్దరు ఎంపీటీసీలపై మిస్సింగ్ కేసులు ఉన్నప్పటికి ఆయన పోలీసులపై అనవసరంగా ఆరోపణలు చేయడం పద్ధతి కాదన్నారు.

ఖేలో ఇండియా ప్రతిభా క్రీడాకారిణికి అభినందనలు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఇటీవల జరిగిన రెండో ఖేలో ఇండియా పారా గేమ్స్‌లో జాతీయస్థాయిలో కాంస్య పతకం సాధించిన పల్లవిని బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ అభినందించారు. ఆమెతో పాటు కోచ్ సురేష్‌కుమార్‌ను శనివారం సత్కరించారు.

చైన్ స్నాచింగ్

అనంతపురం క్రైం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రూరల్ మండల పరిధిలోని కురుగుంట వైఎస్సార్ కాలనీకి చెందిన కటిక పద్మ అనే మహిళ శనివారం సాయంత్రం తన ఇంటి వద్ద నడిచి వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లాడు. దీంతో కిందపడి స్వల్ప గాయపడిన ఆమెను ప్రభుత్వాసుపత్రికి తీసుకెళారు. ఈ ఘటనపై అనంతపురం రూరల్ పోలీసులు ఆరా తీస్తున్నారు.

'జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి'

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పీ 4 విధానంలో ఎస్సీ, ఎస్టీ బీసీలకు జనాభా ప్రాతి పదికన రిజర్వేషన్లు కల్పించాలని ఆలిండియా ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ కోరారు. స్థానిక ఎన్జీఓహోంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎప్పటికప్పుడు నీటిని పరీక్షించాలి

● కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురంరూరల్,మార్చి29(ఆంధ్రజ్యోతి): నీటి నాణ్యత ప్రమాణాల పరీక్షలను ఎప్పటికప్పుడు చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పే ర్కొన్నారు. మండలంలోని ఆలమూరులో శనివారం వైద్య ఆరోగ్య శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల పరిధిలో చేపడుతున్న నీటి నాణ్యత పరీక్షలను ఆయన తనిఖీ చేశారు. వేసవి నేపథ్యంలో నీటినాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. నీటి నాణ్యత ప్రమాణాల పరీక్షలకు సంబంధించి ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో 14రకాల టెస్టులను చేపట్టినట్లు ఎస్‌ఈ తెలిపారు. అన్ని రకాల టెస్టులను చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సురేష్, వైద్యఆరోగ్యశాఖ డీపీఎం రవి శంకర్, ఆర్బీ ఎస్కే అధికారి నారాయణస్వామి, తహసీల్దార్ మోహన్ కుమార్, ఎంపీడీఓ దివాకర్, పంచాయతీ కార్యదర్శి గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఈద్గాలు, మసీదుల వద్ద ఏర్పాట్లు చేయండి

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం అర్బన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదినం రోజు ముస్లిం లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించారు. విదేశీ పర్యటనలో ఉన్న ఆయన శనివారం సంబంధిత అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. రంజాన్ రోజు ఈద్గాలు, మసీదుల్లో తగిన సదుపాయాలు కల్పించారన్నారు. ఎండను దృష్టిలో ఉంచుకొని వృద్ధులు, పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా షామియానాలు, తాగునీరు తదితర వసతులు కల్పించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

శిల్పారామంలో పండుగ సంబరాలు : ఏఓ

అనంతపురం రూరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని శిల్పారామంలో ఉగాది, రంజాన్, శ్రీరామ నవమి పండుగలను పురస్కరించుకుని సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఏఓ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉగాది సందర్భంగా ఆదివారం సాయం త్రం 5గంటల నుంచి పంచాంగ శ్రవణం, శ్రీనృత్య కళా నిలయం బృందంచే భరత నాట్య నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఏప్రిల్ 1వ తేదీన రంజాన్‌ను పురస్కరించుకుని సాయంత్రం 6 గంటల నుంచి శ్రీకృష్ణదేవరాయల రంగస్థల కళాకారుల ఆధ్వ ర్యంలో ఆర్యడాన్స్ అకాడమీ, స్ఫూర్తి విద్యానికేతన్ బృందంచే జానపద, వెస్ట్రన్ నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఏప్రిల్ ఆరో తేది శ్రీరామనవమి సందర్భంగా సంరక్షిత బృందంచే భక్తి గాన నృత్య విభావరి ఉంటుందన్నారు. పట్టణ, పుర ప్రజలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

2 నుంచి తిక్కయ్యస్వామి శతాబ్ది ఉత్సవాలు

నార్పల, మార్చి29 (ఆంధ్రజ్యోతి): మండంలకేంద్రంలో వెలసిన అవధూత తిక్కయ్యస్వామి శతాబ్ది మహోత్సవాలను ఏప్రిల్ 2నుంచి నిర్వహిస్తున్నట్లు శనివారం తిక్కయ్యస్వామి ఆలయ గౌరవాధ్యక్షుడు నార్పల సత్యనారాయణరెడ్డి తెలిపారు. 2వ తేదీ ఉదయం ఆకుపూజ, మధ్యాహ్నం ఉట్ల పరుష, సాయంత్రం గ్రామోత్సవం ఉంటాయన్నారు. అలాగే రాత్రికి చెంచునాటకం, బుర్రకథ ఏర్పాటు చేశామన్నారు. 3వ తేదీ మధ్యాహ్నం అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రూ.1.70 కోట్ల పన్ను వసూలు

అనంతపురం క్రైం, మార్చి29(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో నీటి పన్ను, ఖాళీ స్థల పన్నుకు సంబంధించి శనివారం ఒక్కరోజే రూ.1.70కోట్ల బకాయిలు వసూలయ్యాయి. అపరాధ రుసుముపై 50శాతం రాయితీ ఇవ్వడంతో పన్ను పెంపు వేగం పెరిగినట్లు తెలుస్తోంది. మరో రెండు రోజులే గడువు ఉందని కమిషనర్ బాలస్వామి తెలిపారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్

మత సామరస్యానికి ప్రతీకగా రంజాన్ పండుగ నిలుస్తుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి అన్నారు. నగరంలోని కోవూరునగర్ నిమ్రా మసీదులో నగర మేయర్ మహమ్మద్ వసీం ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో అనంత వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

పండుగ సామగ్రి వితరణ

అనంతపురం కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకుని నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేద కుటుంబాలకు పండుగ సామగ్రి వితరణ చేశారు. ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలామురళి శనివారం రూ. 20వేలు వ్యయంతో 10 హిందు, 10 ముస్లిం కుటుంబాలకు సరుకులను వితరణ చేశారు. కార్యక్రమంలో పురుషోత్తం, మురళీకృష్ణ, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

తిన్న సొమ్ము కక్కించేది ఎప్పుడు..?

డ్వాక్రా మహిళలకు యానిమేటర్లు, సీసీ బురిడీ

రూ.14 లక్షలకుపైగా స్వాహా... ఏళ్లు గడిచినా రికవరీ ఏదీ?



నిధుల దుర్వినియోగంపై వెలుగు కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేస్తున్న డ్వాక్రా సంఘాల మహిళలు (ఫైల్)

యాడికి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కొందరు యానిమేటర్లు, సీసీలు దుర్వినియోగం చేసిన డ్వాక్రా మహిళల రుణాలను రికవరీ చేయకపోవ డంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. 2016-2017 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని తూట్రాళ్లపల్లి, నగరూరు, వెంగన్నపల్లి, తండా గ్రామాల్లో డ్వాక్రా సంఘాల మహిళలకు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, ఉన్నతి పథకాల కింద సుమారు రూ.14లక్షల రుణాలు మంజూరు చేశారు. ఈ రుణాలను అప్పటి యానిమేటర్, సీసీలు మహిళలకు ఇవ్వకుండా సొంత అవసరాలకు వాడుకున్నారు. మరికొంతమంది మహిళలు తాము తీసుకున్న రుణాలకు సంబంధించి వాయిదాల డబ్బును బ్యాంక్‌కు చెల్లించమని యానిమేటర్లు, సీసీలకు అందజేస్తే దాన్ని కూడా మింగేశారు. తీసుకున్న రుణాల చెల్లింపులు జరగకపోవడంతో మహిళా సంఘాలకు నిధులు మంజూరైనా బ్యాంకర్లు వాటిని హోల్డ్‌లో పెట్టారు. దీనిపై మహిళా సంఘాల సభ్యులు వివరాలు ఆరాతీయగా బండారం బయటపడింది. దీనిపై 2020 నుంచి ఆ సంఘాల మహిళలు వెలుగు కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌ల చుట్టూ తిరిగారు. అప్పటి నుంచి తమకు న్యాయం చేయాలని పలు దఫాలుగా రోడ్డెక్కి ఆందోళనలు కూడా చేశారు. అధికారులు విచారణ చేశారు. ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. కానీ సంఘాల మహిళలకు న్యాయం జరగలేదు. ఇటీవల నగరూరు పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. నిధులు దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు చేపట్టకుండా ఏమి చేస్తున్నారని అధికారులను ఆయన మందలించారు. బాధిత మహిళలకు న్యాయం జరిగేలా తగు చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. రోజులు గడిచినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై మహిళా సంఘాల నుంచి విమర్శలు వస్తున్నాయి.

దుర్వినియోగం అయిన నిధుల వివరాలు

1. తూట్రాళ్లపల్లి గ్రామంలో శ్రీలక్ష్మి నరసింహ గ్రామసంఘం రూ.4,25,446.
2. నగరూరు గ్రామంలో వెంకటేశ్వర గ్రామ సంఘం రూ.4,55,000
3. తండా గ్రామంలో సుంకులమ్మ గ్రామ సంఘం రూ.5,40,000

మొత్తం రూ.14,20,446

నిధుల దుర్వినియోగం వాస్తవమే

: చంద్రశేఖర్, వెలుగు ఏపీఎం



గతంలో మహిళా సంఘాల నిధులు దుర్వినియోగమైన మాట వాస్తవమే. ఉన్నతాధికారులకు నివేదించాం. విచారణ కమిటీ వేశారు. దుర్వినియోగం మొత్తంలో రూ.14,20,446 రికవరీ చేయాల్సి ఉంది. బాధిత సంఘాల సభ్యులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేస్తాం.


బఫర్‌తో సఫర్

వైసీపీ పాలనలో నియోజకవర్గంలో భారీ కుంభకోణం

వెయ్యి క్వింటాళ్లకు పైగా బఫర్ స్టాక్ ఉందన్న అధికారులు

అధికారులు, వైసీపీ డీలర్ల కుమ్మక్కుతో స్వాహా

ప్రభుత్వం మారడంతో వెలుగులోకి అక్రమాలు



వైసీపీ పాలనలో రేషన్ షాపుల్లో జరిగిన బఫర్‌స్టాక్ కుంభకోణం నేడు అధికారుల మెడకు చుట్టుకుంటోంది. గత ఐదేళ్లలో రేషన్ బియ్యం కుంభకోణంలో వైసీపీ నాయకులు జేబులు పుల్లుగా నింపుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నియోజకవర్గంలో సుమారు 1000 క్వింటాళ్లకు పైగా బఫర్ స్టాక్ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. చౌక ధరల దుకాణాల మార్పు నేపథ్యంలో బఫర్ స్టాక్ సర్దుబాటుకు అధికారులు నానా తంటాలు పడుతున్నారు. గత ప్రభుత్వంలోని చాలా మంది డీలర్ల వద్ద క్వింటా నుంచి 30 క్వింటాళ్లకు పైగా బఫర్ స్టాక్ ఉన్నట్లు స్పష్టం అవుతోంది. ఈ క్రమంలో గత కొన్ని నెలల నుంచి ఈ సమస్యపై పోరాడుతున్నా నేటికి కొలిక్కి రాకపోవడంతో సివిల్ సప్లై అధికారులు, నూతన డీలర్లు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

- ఆంధ్రజ్యోతి, కళ్యాణదుర్గం

ఇదీ సమస్య...

బయోమెట్రిక్ ద్వారా నిత్యావసరాలు పంపిణీ ప్రారంభమైనప్పటి నుంచి ప్రతినెలా పంపిణీ తరువాత డీలర్ల వద్ద మిగిలి ఉన్న(బఫర్) నిత్యావసరాలను తదుపరి నెలకు కలుపుకుని అలాట్‌మెంట్ చేస్తారు. ఈ నేపథ్యంలో పాత డీలర్లకు రావాల్సిన కమీషన్ జమ చేసుకున్నప్పటికీ అలాట్‌మెంట్ ఎక్కువగా ఉండటంతో ఇంకా ఎక్కువగా చెల్లించాల్సిన పరిస్థితి ఉంటోంది. 2019లో తాము బాధ్యతలు తీసుకున్న సమయంలో తమకు ఇలాగే బఫర్ ఇచ్చారని వైసీపీ డీలర్లు వాదనకు దిగుతున్నారు.

ఇన్‌చార్జి, బినామీలే అధికం

నియోజకవర్గంలో కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం మండలాల్లో నలుగురు మాత్రమే రెగ్యులర్ ప్రాతిపదికన డీలర్లు ఉన్నారు. మిగిలిన వారందరూ ఇన్‌చార్జులు, బినామీలే. ఎవరో పేరు మీద ఎవరో దుకాణం నిర్వహించారు. ఇలా ఐదేళ్ల వైసీపీ పాలన అంతా ఇన్‌చార్జులు, బినామీలతోనే సాగింది. దీంతో మిగులు బియ్యాన్ని ఎవరికి వారే మింగేసినట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో బఫర్‌ను వసూలు చేయడం కష్టంగా మారుతోంది. వైసీపీ ప్రభు త్వ హయాంలో కొందరు ఆ పార్టీ నాయకులు, మద్దతుదారులు డీలర్లుగా ఉండటంతో కొం దరు రెవెన్యూ అధికారులు బఫర్‌ను పట్టించుకోకుండా నెలవారీ కోటా వేసేవారు. ప్రస్తుతం నూతన డీలర్లు మాత్రం బఫర్ లేకుండా స్టోర్‌లు తమకు అప్పగించాలని అధికారులను కోరుతున్నారు.



బఫర్ బియ్యాన్ని అమ్మేశారు

కొందరు డీలర్లు బఫర్ బియ్యాన్ని అమ్మేయగా మరికొందరి వద్ద స్టాక్ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకొందరు బియ్యాన్ని అమ్మి జొన్నలు, రాగులను ఎక్కువగా చూపారు. కంబదూరు, కుందుర్పి, శెట్టూరు మండలాలకు కేవలం రెండు కిలోమీటర్ల దూరంలోనే కర్ణాటక సరిహద్దు ఉండటంతో ఎక్కువగా రేషన్ బియ్యాన్ని తరలించినట్లు తెలుస్తోంది. ఈ మండలాల్లోనే ఎక్కువగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుండగా పోలీసులు పట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. బఫర్ ఉన్న డీలర్లపై 6ఏ కేసులు పెట్టాలా లేక క్రిమినల్ చర్యలు తీసుకోవాలా అంటూ రెవెన్యూ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.



అధికారుల్లో ఆందోళన

బఫర్ బియ్యం బొక్కుడులో ఆయా మండలాల పరిధిలోని రెవెన్యూ అధికారులు, స్టాక్ పాయింట్ అధికారుల ప్రమేయం కూడా ఉండటంతో వారిలో ఆందోళన మొదలైంది. వైసీపీ పాలనలో అధికారులు, డీలర్లు కమ్మక్కై కర్ణాటకకు రేషన్ బియ్యాన్ని తరలించారన్న ఆరోపణలు ఉన్నాయి. పాత డీలర్లపై ఎక్కువగా ఒత్తిడి పెడితే తమ పేర్లు బయట పెడతారన్న భయం అప్పటి అధికారులను వేధిస్తోంది.

సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ప్రతి రేషన్ షాపుల్లోను బఫర్ ఉందని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఈ సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో బఫర్ సమస్యతో స్టోర్ డీలర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారు. జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సివిల్ సప్లై కమిషనర్ దృష్టికి కూడా తీసుకెళ్లి సమస్యను పూర్తి స్థాయిలో వివరించారు. దీంతో ఈ బఫర్ సమస్య కొద్ది రోజుల్లోనే పరిష్కారం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

- రమేష్‌రెడ్డి, డీఎం, సివిల్ సప్లై, అనంతపురం

తోపుదుర్తిపై కేసు నమోదు

పెనుకొండ టౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం పెనుకొండ తహసీల్దార్ కార్యాలయంలో దౌర్జన్యానికి దిగిన 25 మందిపై పోలీసులు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్, జడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ తదితరులను నిందితులుగా చేర్చారు. తహసీల్దార్ సమక్షంలో ఉన్న ఎంపీటీసీలను తీసుకెళ్లే ప్రయత్నంలో మాజీ తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, అతని అనుచరులు పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని, విధుల్లో ఉన్న పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించారని ఆయన అన్నారు. రెండు గ్రూపుల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడటం, రాష్ డ్రైవింగ్ చేస్తూ భయభ్రాంతులకు గురిచేయడం, కార్యాలయంలోకి చొరబడటం వంటి నేరాలకు పాల్పడినందుకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైల్లో అర్ధరాత్రి దోపిడీ

షిరిడీ-చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో చొరబాటు

హిందూపురం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): షిరిడీ నుంచి చెన్నైకి వెళ్లే ప్రత్యేక రైలులో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు చొరబడ్డారు. పుట్టపర్తి సమీపంలోని నారాయణపురం వద్ద చైను లాగి రైలును ఆపారు. స్లీపర్ బోగీలో మహిళ మెడలో బంగారు గొలుసుని లాక్కున్నారు. మరో బోగీలో లాక్కునేందుకు ప్రయత్నించగా మహిళ కేకలు వేసింది. దీంతో వారు అక్కడే దిగి పారిపోయారు. ఆర్‌పీఎఫ్ పోలీసులకు రైల్వే టీటీ సమాచారం ఇచ్చారు. దీంతో హిందూపురం స్టేషన్‌కు రైలు చేరుకోగానే రైల్వే పోలీసులు, ఆర్‌పీఎఫ్ సిబ్బంది రైలు ఎక్కి, బెంగళూరు వరకు తనిఖీ చేస్తూ వెళ్లారు. చెన్నైలో దిగిన తరువాత ఫిర్యాదు చేస్తామని బాధితులు చెప్పారని హిందూపురం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపారు. దొంగలు రైలును ఎక్కడ ఎక్కారనే కోణంలో రైల్వే పోలీసులు విచారిస్తున్నారు. చోరీ ఘటనపై స్పష్టమైన సమాచారం లేదు. నారాయణపురం వద్ద అటవీ ప్రాంతంలో రైలు ఆగడంతో ప్రయాణికులు ఆందోళన చెందినట్లు సమాచారం.

యువతి అదృశ్యం



పూజిత(ఫైల్)

ధర్మవరం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యసాయినగర్‌కు చెందిన శ్రీనివాసులు కుమార్తె పూజిత అదృశ్యమైనట్లు తల్లి భాగ్యలక్ష్మి టూటౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. పూజిత పట్టణంలోని గండికోట ప్రైవేటు ఆస్పత్రిలో నర్స్‌గా పనిచేస్తోంది. ఈమె ఈనెల 26న ఇంటి నుంచి బయటకు వచ్చి, తిరిగి వెళ్లలేదు. దీంతో బంధువులు, స్నేహితుల వద్ద విచారించిన ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు తల్లి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

భారమైన పశు పోషణ

భారీగా పెరిగిన గ్రాసం ధరలు - ఆందోళనలో అన్నదాతలు

బత్తలపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశుగ్రాసం ధర పెరగడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది వరి, వేరుశనగ పంటల సాగు తగ్గడంతో గ్రాసం కొరత ఏర్పడింది. గ్రాసం ధరలు పెరగడంతో పశు పోషణ భారమైందని పాడి రైతులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆవులు, ఎద్దులు 2.97లక్షలు గేదెలు 60వేలు, గొర్రెలు, మేకలు 29లక్షలు ఉన్నాయి. బయట ఎక్కడేగాని కాసింత కట్టిపుల్ల కూడా దొరకని ప్రస్తుత వేసవిని దాటడం ఎలా అంటూ పోషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్ వేరుశనగ గడ్డి రూ.40వేలు, వరిగడ్డి ట్రాక్టర్ రూ.30వేలు పలుకుతోంది ఇంత అధిక ధరలు పెట్టి పోషించాలంటే కష్టమని పాడి రైతులు పేర్కొంటున్నారు. అయితే గ్రాసం ధరలు పెరిగినా పాల ధరలు మాత్రం పెరగకపోవడంతో పాడి పశువుల పోషణ కష్టంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డెయిరీలలో లీటరు పాలను రూ.30 నుంచి రూ.35లకే కొంటుండటంతో ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదని వాపోతున్నారు. అధికారులు జోక్యం చేసుకుని పాల ధరలు పెంచాలని కోరుతున్నారు.



ట్రాక్టర్‌లో తరలిస్తున్న పశుగ్రాసం

ఉచితంగా గడ్డిని అందించాలి



ప్రస్తుతం పశుగ్రాసం ధరలు అధికంగా ఉన్నాయి. దీంతో పశు పోషణ భారంగా మారింది. ప్రభుత్వమే పశుగ్రాసాన్ని ఉచితంగా అందించి ఆదుకోవాలి.

- సుదర్శన్, పాడి రైతు, బత్తలపల్లి

పశువులను అమ్ముదామన్నా



పశుగ్రాసం ధరలు విపరీతంగా పెరిగాయి. పశుపోషణ భారమై వాటిని అమ్ముదామంటే తక్కువ ధరకు అడుగుతున్నారు. ప్రభుత్వం ఉచితంగా గడ్డిని పంపిణీ చేయాలి.

బాబు, పాడిరైతు, బత్తలపల్లి

తాడిపత్రి మున్సిపాలిటీకి అవార్డు



మాట్లాడుతున్న కమిషనర్ శివరామకృష్ణ

తాడిపత్రి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో జరిగిన 100వ స్కోచ్ అవార్డుల వేడుకల్లో తాడిపత్రి మున్సిపాలిటీకి వెండి అవార్డు దక్కింది. ఈ అవార్డును మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ శనివారం అందుకున్నారు. పట్టణంలో ఘన వ్యర్థ సేకరణ, నాశన పద్ధతులు విభాగంలో విశేష కృషిచేసినందుకుగాను అవార్డును ప్రకటించారు. తాడిపత్రి మున్సిపాలిటీ స్థిరమైన వ్యర్థ నిర్వహణ, పట్టణ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ రంగంలో చేసిన సేవలకు గాను అవార్డు సాధించి ఇతర మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలుస్తోందని కమిషనర్ తెలిపారు.

సంతానం కలగలేదని ఆత్మహత్య

గార్లదిన్నె, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు మారుతీ నగర్‌కు చెందిన షేక్ షెక్షావలి(32) సంతానం కలగలేదని శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు షేక్ షెక్షావలికి షేక్ షాహిదాతో నాలుగేళ్ల కిందట వివాహం జరిగింది. దంపతులు కూలి పనులు చేసుకుని జీవించేవారు. సంతానం కలుగకపోవడంతో వీరు తరచూ మథన పడేవాడు. ఈ క్రమంలోనే షెక్షావలి మద్యానికి బానిస అయ్యాడు. దీంతో భార్య, భర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. శుక్రవారం ఇంట్లో భార్య, ఇతర కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగా షెక్షావలి వరండాలో పడుకున్నాడు. అయితే శనివారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు బయటికి వచ్చి చూడగా షెక్షావలి ఉరికి వేలాడుతూ కనిపించాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి తల్లి ఉన్నారు.

నిష్పక్షపాతంగా భద్రతా చర్యలు చేపట్టాం

● ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్

రామగిరి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ ఉప ఎన్నిక సందర్భంగా 27, 28 తేదీల్లో నిష్పక్షపాతంగా భద్రతాచర్యలు చేపట్టామని, మాజీ ఎమ్మెల్యే ఆరోపణలు అవాస్తవమన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వైసీపీ ఎంపీటీసీలను వారు ఉద్దేశ్యపూర్వకం గా ఆలస్యంగా తెచ్చారంటూ అందుకు సంబంధించిన ఆధారాలను ఎస్‌ఐ విడుదల చేశారు. ఎంపీటీసీ సభ్యులను సముద్రం ఒడ్డుకు తీసుకెళ్లి సోషల్ మీడియాలో ఫొటోలు పెట్టడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే అన్నారు. ప్రజలలో అనవసరమైన భయాందోళనను సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కల్గించారన్నారు. పెనుకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద కూడా ప్రమాదకరంగా ప్రవర్తించడం, బూతులు తిడుతూ మాట్లాడటం హేయమైన చర్య అన్నారు. ఇద్దరు ఎంపీటీసీలపై మిస్సింగ్ కేసులు ఉన్నప్పటికి ఆయన పోలీసులపై అనవసరంగా ఆరోపణలు చేయడం పద్ధతి కాదన్నారు.

రోడ్డు ప్రమాదంలో బేల్దారి మృతి

అనంతపురం క్రైం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): నగర శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఆత్మకూరు మండలం యాలేరుకు చెందిన బేల్దారి ఎం.రామక్రిష్ణ(35), ఇస్మాయిల్, ఎర్రిస్వామితో కలిసి శనివారం అనంతపురంలోని ఓ ఓ ఇంటి నిర్మాణ పనులకు ద్విచక్రవాహనంలో బయలుదేరారు. గుడ్‌చిల్డ్రన్స్ స్కూల్ సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన ఓ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. దీంతో రామక్రిష్ణకు తీవ్రగాయాలు కాగా, ఎర్రిస్వామి, ఇస్మాయిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారిని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామక్రిష్ణ మృతి చెందాడు. కాగా ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారయ్యాడు. రూరల్ పోలీసులు లారీని స్వాధీనం చేసుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆశకుపోయి.. మోసపోయాడు..!

పెద్దవడుగూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): అపరిచిత వ్యక్తుల నుంచి వడ్డీలేని లోన్ ఇస్తాం.. మీరు లాటరీలో గెలుపొందారు.. వంటి మాటలకు ప్రలోభపడి మోసపోవద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటనలు ఇస్తున్నా.. గ్రామీణ ప్రాంత ప్రజలు మోసపోతూనే ఉన్నారు. మండలంలోని విరుపాపురం గ్రామానికి చెందిన రామచంద్ర అనే వ్యక్తికి శనివారం ఫోన్‌చేసి మీకు రూ.4లక్షలు వడ్డీలేని రుణం మంజూరైంది.. అందుకు ప్రాసెసింగ్ నిమిత్తం ఆన్‌లైన్ ద్వారా రూ.35వేలు చెల్లించాలని చెప్పడంతో ఆశపడి చెల్లించాడు. ఫోన్‌చేసిన వ్యక్తికి డబ్బులు చెల్లించాలని చెప్పడం కోసం ఫోన్‌చేయగా స్విచ్‌ఆఫ్ చేసి ఉంది. బాధితుడు తాను మోసపోయినట్లు గ్రహించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చికిత్స పొందుతూ ఉద్యోగి మృతి

డిసెంబరు 18న అదాని సిమెంట్ ఫ్యాక్టరీలో ప్రమాదం



షణ్ముకానందరెడ్డి (ఫైల్)

యాడికి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): యాడికి మండలంలోని అదాని సిమెంట్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉద్యోగి, నిట్టూరు గ్రామానికి చెందిన గూడూరు షణ్ముకానందరెడ్డి (30) బెంగళూరులో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. 2024 డిసెంబరు 18న యాడికి మండలం బోయరెడ్డిపల్లి వద్ద ఉన్న అదాని సిమెంట్ ఫ్యాక్టరీలో కూలర్‌లో మరమ్మతులు చేస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. మరమ్మతులు చేపట్టడానికి వెళ్లిన కార్మికులు కూలర్ తలుపులను ఒక్కసారిగా తెరవడంతో నిప్పుకణికలు ఎగిరి వారిపై పడ్డాయి. ఈ ఘటనలో అప్పట్లో ఐదుగురు తీవ్రంగా గాయపడగా, ఒకరు మృతిచెందారు. తీవ్రంగా గాయపడ్డ షణ్ముకానందరెడ్డిని చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. మూడున్నర నెలలుగా బెంగళూరులో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో శనివారం మృతిచెందాడు. షణ్ముకానందరెడ్డికి భార్య, తల్లిదండ్రులు ఉన్నారు. ఉగాది పండుగ పూట షణ్ముకానందరెడ్డి మృతిచెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

టీడీపీకి కార్యకర్తలే బలం: ప్రభుత్వ విప్ కాలవ


సీనియర్ నాయకులను సత్కరిస్తున్న కాలవ

రాయదుర్గం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్తలే బలమని, ఆపదలో పార్టీ జెండా మోసిన ప్రతి కార్యకర్త కుటుంబాన్ని ఆదుకోవటానికి ప్రతి క్షణం పని చేస్తానని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు భరోసా ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించటానికి ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘననివాళి అర్పించారు. అనంతరం స్థానిక సీతారామాంజనేయస్వామి ఫంక్షన్ హాల్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. తొలుత ఎంపిక చేసిన సీనియర్ నాయకులను శాలువాలు, మెమెంటోలతో ఘణంగా సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి వెనుకబడ్డ తరగతుల వారిలో రాజకీయ చైతన్యాన్ని తీసుకొచ్చారని తెలిపారు. ఆ రోజు ఆయన చూపినదారి ఎందరికో సామాన్యుల చేతుల్లోకి అధికారం వచ్చిందని తెలిపారు. పార్టీకి ఆది నుంచి కార్యకర్తలే నిజమైన బలమని అన్నారు. పార్టీ అంచెలంచెలుగా ఎదిగి నేడు చంద్రబాబు నాయకత్వంలో దేశంలోనే గొప్ప రాజకీయశక్తిగా ఎదిగిందని పేర్కొన్నారు. వైసీపీ దుర్మార్గాలతో నలిగిపోయిన కార్యకర్తలను ఆదుకోటానికి సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటానని వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని హామీ ఇచ్చారు. పార్టీలో పనిచేస్తున్న వారికి త్వరలో గుర్తింపుకార్డులు ఇస్తామని పేర్కొన్నారు.

టీడీపీతోనే పేదరిక నిర్మూలన: ఎమ్మెల్యే అమిలినేని


ప్రజావేదిక వద్ద ఎన్టీఆర్ విగ్రహంపై పూలు జల్లుతున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద శనివారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో టీడీపీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పార్టీ జెండాను నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. దేశంలోనే కోటి సభ్యత్వాలు నమోదు చేసుకున్న ఏకైక ప్రాంతీయ పార్టీ టీడీపీనేనని తెలిపారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేశ్ నేతృత్వంలో పార్టీ దినదినాభివృద్ధి చెందుతోందని అన్నారు. ముఖ్యంగాపార్టీ తొలినుంచి పేదరిక నిర్మూలనకు ఎంతో కృషి చేస్తోందని అన్నారు. కష్టపడిన ప్రతికార్యకర్తకు పార్టీ తగు ప్రాధాన్యం కల్పిస్తోందని పేర్కొన్నారు. అదేవిధంగా స్థానిక ఎన్టీఆర్ భవన్ వద్ద కూడా ఆయన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను కూడా ఎగరవేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు టీడీపీ: ఎమ్మెల్యే అశ్మిత్


కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, మార్చి29(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ మారుపేరు తెలుగుదేశం పార్టీ అని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ ఆవిర్భావ వేడుకలను పట్టణంలోని తన నివాసంలో శనివారం ఆయన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించి , కేక్‌కట్‌చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి తెలుగు వారి కీర్తిని దేశ నలుమూలలా వ్యాపింపజేశారని కొనియాడారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో పార్టీ మరింత బలపడుతోందని చెప్పారు. కౌన్సిలర్లు, ప్రజలు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కార్యకర్తలు, నాయకులతో కలిసి పెద్దఎత్తున బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కనిపించని టీడీపీ ఆవిర్భావ వేడుకలు

విడపనకల్లు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో టీడీపీ ఆవిర్భవ దినోత్సవ వేడుకలను నాయకులు ఒక్కరు కూడా పట్టించుకోలేదు. నియోజక వర్గంలో ప్రతి మండలంలోను టీడీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తే విడపనకల్లు మండలంలో మాత్రం ఆ హడావుడి కనిపించ లేదు. నాయకులు సంపాదనకు ప్రాధాన్యత ఇస్తున్నారే తప్ప పార్టీ కార్యక్రమాలు మాత్రం పట్టించుకోవడం లేదు. శనివారం టీడీపీ ఆవిర్భా దినోత్సవాన్ని నిర్వహించక పోవటంపై పలువురు ప్రజలు విమర్శలు గుప్పించారు.

నేమకల్లు అంజన్నకు విశేష పూజలు


పుష్పాలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయాన్నే అర్చకులు మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు పెద్దఎ తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. బళ్లారి రూరల్ మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి ఆలయంలో హోమం జరిపించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తికి పల్లకిలో ఉంచి ఊరేగించారు. దేవాదాయ అధికారి ఓబన్న, తదితరులు పాల్గొన్నారు.

కసాపురంలో వెండి ప్రాకారోత్సవం

గుంతకల్లుటౌన్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం రాత్రి స్వామివారికి వెండి ప్రాకారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు తొలుత స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణంలో వెండి రథంలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి మేళతాళాల మధ్య ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ఈఓ వాణి, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

మామిడితోట దగ్ధం


దగ్ధమైన మామిడితోట

కంబదూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గూళ్యం గ్రామంలో రైతు గొర్ల వెంకటేశ్వర్లు చెందిన మామిడితోట శనివారం దగ్ధమైంది. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతోనే ఇలా జరిగిందని, సుమారు 20 ఎకరాల్లోని మామిడి చెట్లు కాలిపోయాయని బాధిత రైతు వాపోయాడు. వీటితో పాటు డ్రిప్పులు, స్పింక్లర్లు, పైపులు కూడా దగ్ధమయ్యాయన్నారు. సుమారు రూ. లక్షల్లో నష్టం వాటిల్లినట్లు ఆవేదన చెందాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం

- పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవంలో వక్తలు
- ఊరూ వాడా ఘనంగా వేడుకలు


గుంతకల్లులో టీడీపీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్, నాయకులు


పామిడిలో మాట్లాడుతున్న టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్


కణేకల్లులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ శ్రేణులు


ఉరవకొండలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నాయకుల నివాళి


కూడేరు మండలం గొట్కూరులో జెండావిష్కరణలో టీడీపీ శ్రేణులు


బెళుగుప్పలోఎన్టీఆర్ విగ్రహం వద్ద ..


గుమ్మఘట్టలో..


యాడికిలో ..

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: తెలుగుదేశం పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని వక్తలు పేర్కొన్నారు. పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజ కవర్గాలవ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాడ వాడలా నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. అలాగే పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. నందమూరి తారక రామారావు 1982లో పార్టీని స్థాపించారని, ఆ తర్వాత 9 నెలల్లోనే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ తిరుగులేని మెజారిటీతో రికార్డు విజయం సాధించిందని గుర్తు చేశారు. టీడీపీ వచ్చాకనే పేదలకు, బడుగులకు, అణగారిన వర్గాల వారికి న్యాయం జరిగిందని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం ముందుకు సాగుదామంటూ పిలుపునిచ్చారు.


కుందుర్పిలో ..


బ్రహ్మసముద్రంలో..


శెట్టూరు మండలం బసంపల్లిలో..


గుత్తి మండలం బేతాపల్లిలో ..

బహిరంగ ప్రజావేదిక

గుత్తిరూరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం బహిరంగ ప్రజావేదిక నిర్వహించారు. మండల వ్యాప్తంగా 24 గ్రామ పంచాయతీల్లో 2023 జనవరి 4 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు వరకు ఉపాధి హామీ పథకం ద్వారా 846 పనులు జరిగాయి. ఇందుకు రూ.15.30 కోట్లు ఖర్చు చేశారు. వాటిపై సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేపట్టారు. ఆ విషయాలను ప్రజావేదికలో వెల్లడించారు. మండలంలో కొన్ని గ్రామాల్లో పనులు చేయకపోయినా బిల్లులు డ్రా చేసినట్లు తెలిపారు. రూ. 1.17 లక్షల అవినీతి జరిగినట్లు వెల్లడించి బాధ్యుల నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు. డ్వామా పీడీ సలీంబాషా, అడిషనల్ పీడీ సుధాకర్, అంబుడ్స్‌మెన్ వెంకట శివారెడ్డి, ఎంపీడీఓ ప్రభాకర్ , ఎంపీపీ విశాలక్షి , ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పండగ సంత..



కొనుగోలుదారులతో రద్దీగా మార్కెట్, పండ్లు, పూలు విక్రయానికి ఉంచిన పల్లె వాసులు

తాడిపత్రి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను పురస్కరించుకొని పట్టణంలోని కూరగాయల మార్కెట్, పోలీస్‌స్టేషన్ సర్కిల్ ప్రాంతాలు శనివారం కిటకిటలాడాయి. పండుగ సామగ్రి కొనుగోలు చేయడానికి స్థానికులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. పల్లెల నుంచి చిరు వ్యాపారులు పూలు, పళ్లు, టెంకాయలు, మామిడిఆకులు తెచ్చి విక్రయానికి ఉంచారు. ప్రతి దుకాణమూ కొనుగోలు దారులతో కిక్కిరిసింది.

పౌరహక్కులపై అవగాహన

కంబదూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెర్లోపల్లిలో శనివారం సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది కలిసి పౌర హక్కులపై ప్రజలక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా ప్రజలకు అందరికీ సమాన హక్కులు కల్పించిందన్నారు. ఎస్సీ, ఎస్టీలను కులం పేరుతో దూషించడం కాని, మతం పేరుతో వేధించడం కాని చేయరాదని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రశాంతమైన వాతావరణంలో జీవించాలని సూచించారు. వసతి గృహ వార్డెన్ నాగరాజు, వీఆర్వో సంజీవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

● పెద్దవడుగూరు : మండలంలోని కిష్టిపాడు ఆర్డీటీ పాఠశాలలో తహశీల్దార్ ఉషారాణి పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా గ్రామ ప్రజలకు హక్కులపై అవగాహన కల్పించారు. పోలీసు సిబ్బంది, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్లో ఇన్వెస్టర్ కేర్‌మని

విడపనకల్లు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో శనివారం స్కౌట్స్ గైడ్స్ కార్యక్రమంలో భాగంగా ఇన్వెస్టర్ కేర్‌మని(పెట్టుబడి వేడుక)ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 18 మంది బాలికలు, 18 బాలురకు స్కౌట్స్, గైడ్స్ యూనిఫామ్‌ను పంపిణీ చేశారు. ఏప్రిల్ 2 నుంచి 6వతేదీ వరకూ అనంతపురంలో జరిగే జిల్లా స్థాయి స్కౌట్స్ గైడ్స్ శిక్షణలో బాలికలు నలుగురు, బాలురు నలుగురు పాల్గొననున్నట్లు హెచ్‌ఎం సురేష్‌బాబు తెలిపారు. స్కౌట్స్‌గైడ్స్ కెప్టెన్ ప్రభావతమ్మ, ట్రూప్ మాస్టర్ కిషోర్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీనియర్ నాయకులకు సన్మానం

పుట్లూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): బుక్కరాయసముద్రం మండలం నీలారెడ్డిపల్లిలో శనివారం నిర్వహించిన టీడీపీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో పుట్లూరు మండల సీనియర్ నాయకులను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఘనంగా సన్మానించారు. టీడీపీ మండల మాజీ కన్వీనర్ శివశంకర్‌రెడ్డి, తక్కళ్లపల్లి ఎర్రన్నను శాలువా కప్పి, పూలమాల వేసి సన్మానించారు. పార్టీకి చేసిన సేవలను అధిష్టానం గుర్తించి సన్మానించినట్లు శివశంకర్‌రెడ్డి తెలిపారు.

పందుల అపహరణ కేసులో ఇద్దరి అరెస్టు

బెళుగుప్ప, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పందులు అపహరించిన కేసులో ఇద్దరు నిందితులను శనివారం గుండ్లపల్లి క్రాస్‌లో అరెస్టు చేసి రూ. 30 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ..స్థానికుడు రాజుకు చెందిన పది పందులను ఈ యేడాది జనవరి 6వ తేదీ అపహరించారు. గుండ్లపల్లి క్రాస్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని విచారించగా ఐదుగురు ముఠా సభ్యులుగా వుండి పందులు ఎత్తుకెళ్లినట్లు తేలింది. కళ్యాణదుర్గానికి చెందిన బాలరాజు, రాయదుర్గానికి చెందిన నాగరాజు పట్టుబడ్డారు. ఇప్పటికే ఒకరు కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గం జైలులో వున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. పట్టుబడిన వారిని కోర్టుకు హాజరు పరచనున్నట్లు పేర్కొన్నారు.

ఎట్టకేలకు తారురోడ్డు వేశారు..


తిమ్మాపురంలో నూతనంగా వేసిన తారురోడ్డు

ఆంధ్రజ్యోతి స్పందన

గుంతకల్లుటౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం గ్రామం సమీపంలో వెళ్లే అంకోలా-నెల్లూరు జాతీయ రహదారిపై ఎట్టకేలకు ఆర్అండ్‌బీ అధికారులు గురువారం తారు వేశారు. ఈ రోడ్డుపై కంకరడస్టు వేసి అలాగే వదిలేయడంతో స్థానిక ప్రజలు దుమ్ముధూళితో నరకయాతన పడుతుండేవారు. దీనిపై గత ఫిబ్రవరి 2వ తేదీన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు రెండు నెలల తరువాత తారు రోడ్డు వేయడంతో అక్కడ నివాసముంటున్న ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని కోరారు.

పాలిసెట్ కోసం ఉచిత శిక్షణ

రాయదుర్గంరూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా కోర్సులలో అడ్మిషన్ పొందాలనుకునే పదో తరగతి పరీక్షలు రాసిన, ఇంతకు ముందు పాస్ అయిన విద్యార్థులు ఏప్రిల్ 30వ తేదీన నిర్వహించే పాలిసెట్ పరీక్షలో అర్హత సాధించవలసి ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలో అర్హత సాధించుటకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ కళాశాలలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. హాజరయ్యే విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 8500419914, 9966276871కు సంప్రదించాలని లేదా నేరుగా కళాశాలకు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పారిశుధ్యకార్మికులకు దుస్తుల పంపిణీ

పామిడి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పామిడి పంచాయతీలోని పారిశుధ్య కార్మికులకు శనివారం అధికారులు, టీడీపీ నాయకులు దుస్తులు, చెప్పులు, ఇతరత్రా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పారిశుధ్య కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో భాగంగా దుస్తులు, చెప్పులు, ఆయిల్, సబ్బులు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తేజోత్స్న, ఈఓ గోపాల్, టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ చౌదరి, మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్‌పీరా, ఏపీ గిరిజన సహకార సంస్థ డైరెక్టర్ రమేష్‌నాయక్, టీడీపీ ముస్లిం మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రఫీ, పట్టణ అధ్యక్షుడు కొట్టం మాలిక్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మా మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ మిత్రులకు..

బ్రహ్మసముద్రం: మండలంలోని సంతే కొండాపురం గ్రామ పంచాయతీ పరిధిలో పని చేస్తున్న క్లాప్ మిత్రులకు ఉగాది పండుగ సందర్భంగా గ్రామ సర్పంచ్ మల్లెల వనిత దుస్తులను, నిత్యావసర సరుకులను అందజేశారు. ఆరుగురికి సుమారు రూ. 20 వేలు విలువజేసే సరుకులను, దుస్తులను అందించినట్లు సర్పంచ్ తెలిపారు.

ఆస్తి పన్ను పెంచరాదని వినతి

గుంతకల్లుటౌన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 1వ తేదీనుంచి ఆస్తి పన్ను పెంచరాదని పట్టణ పౌరుల సమాఖ్య సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ భవానిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సమాఖ్య పట్టణ కన్వీనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఆస్తి పన్నుకు సంబంధించిన జీఓ నెంబర్ 198ను వెంటనే రద్దు చేయాలన్నారు. ఆస్తిపన్నులపై వంద శాతం వడ్డీ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వై శ్రీనివాసులు, జెన్నేమస్తాన్, సురేంద్రబాబు, రామునాయక్, అబ్దుల్లా, షకీరా పాల్గొన్నారు.

నీటిని వృథా చేయరాదు

రాయదుర్గంరూరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని పట్టణ ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి సూచించారు. రాయదుర్గం పట్టణానికి తాగునీటిని సరఫరా అందించే వీరాపురం పంప్‌హౌస్‌ను కమిషనర్‌తో పాటు ఇంజనీర్ నరసింహులు సందర్శించారు. ఇందులో భాగంగా రాతిబావివంక వద్ద గల పైపులైన్ లీకేజీను తనిఖీ చేసి పైపులైను మరమ్మతు పనులను వెంటనే చేయించాలని ఇంజనీరింగ్ అధికారులకు కమిషనర్ ఆదేశించారు. అదే విధంగా వీరాపురం పంప్‌హౌస్ స్టాండ్‌బై మోటార్‌ను మరమ్మతుల కొరకు బళ్లారికి పంపామన్నారు. పట్టణంలో నీటి సరఫరా సరిగ్గాలేని ప్రాంతాలకు మున్సిపల్ ట్యాంకర్‌ల ద్వారా సరఫరా చేస్తామన్నారు. ప్రజలందరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపులకు ప్రత్యేక కౌంటర్లు

గుత్తి,మార్చి29(ఆంధ్రజ్యోతి):విద్యుత్ వినియోగదారులు తమ బిల్లులు చెల్లించేందుకు సెలవు రోజుల్లో విద్యుత్ ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామని ట్రాన్స్‌కో ఈఈ పద్మానాభపిళ్లై శనివారం ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఆది, సోమ సెలవు రోజుల్లో తమ బిల్లులను స్థానిక కౌంటర్లలో బిల్లులు చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలన్నారు.

సమస్యల్ని సృష్టించడానికి వైసీపీ యత్నం: టీడీపీ

తాడిపత్రి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వైసీపీ లేనిపోని సమస్యల్ని సృష్టించడానికి ప్రయత్నిస్తోందని టీడీపీ కౌన్సిలర్లు రహీం, షెక్షావలి ఆరోపించారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇక్కడ వైసీపీ నాయకుడు ఫయాజ్‌బాషాకు ఏదో జరిగిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డితోపాటు మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కర్నూలు నాయకులు తాడిపత్రికి వస్తున్నామనడం హాస్యాస్పదమన్నారు. వారు తాడిపత్రికి వచ్చేది సమస్యలను సృష్టించడానికేనని తెలిపారు. వారు ఇక్కడికి రావాల్సిన పని లేదని, మేమే అనంతపురానికి వస్తామని ఏదైనా ఉంటే అక్కడే పరిష్కరించుకుందామంటూ సవాల్ విసిరారు. ఇక్కడ ఫయాజ్‌బాషాకు సంబంధించిన విషయం వ్యక్తిగతమని, ఇది కులానికి, మతానికి సంబంధం కాదని తెలిపారు. తాడిపత్రిలో ఫయాజ్‌ను అడ్డంపెట్టుకొని మతకక్షలు ప్రేరేపించడానికి అనంత వెంకటరామిరెడ్డి, పెద్దారెడ్డి కలిసి డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. ఫయాజ్‌బాషా మున్సిపాలిటీ యాక్ట్ ప్రకారం ఇళ్లు నిర్మించలేదని, కనుక వాటిపైన మున్సిపల్ చైర్మన్ స్పందించారని అన్నారు. అంతేకానీ ఇందులో ఎలాంటి దురుద్దేశం లేదని తెలిపారు.

పోలీసుల అలర్ట్..

కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు చెందిన వైసీపీ నాయకులు ఫయాజ్‌బాషాతో కలిసి తాడిపత్రికి వస్తున్నారని తెలియడంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. వీటికి ప్రతిగా టీడీపీ నాయకులు కూడా భారీ ఎత్తున ఎమ్మెల్యే ఇంటికి చేరుకోవడంతో తాడిపత్రిలో ఏం జరుగుతుందోనని పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

సబ్సిడీ వ్యవసాయ పనిముట్ల పంపిణీ

రాయదుర్గంరూరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో శనివారం వ్యవసాయ శాఖ వారురైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ చేపట్టారు. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు హాజరై పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చటానికి సీఎం చంద్రబాబు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారన్నారు. రాబోయే ఏడాది మరింత మందికి సబ్సిడీ పనిముట్లు అందిస్తామని పేర్కొన్నారు. రైతు రథాల పంపిణీ కూడా అమలు చేస్తామన్నారు. వ్యవసాయశాఖ ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓ మహేంద్ర, టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు, జుంజురంపల్లి సర్పంచ్ వన్నూరు స్వామి, మాజీ ఎంపీటీసీ పురుషోత్తం, రైతులు పాల్గొన్నారు.